నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 13-2-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:148 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

పాట్ల నిర్మాణం
రైతుల సోలార్ సాగు
లాభాల పంట

మొక్కల మేళ
పచ్చదనపు హేల
పూల ముంగిలి

గతికి చక్రం
అక్షరాస్యత గుణం
చెడుపై రణం

తగ్గాలి పన్ను
సగటువాడి మాట
బడ్జెట్ పై ఆశ

మధ్యాహ్నం బువ్వ
విద్యార్థులకు చేవ
నేడు అధ్యాసం

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజం

డెబ్భయిఏళ్ళ వయసులో
జరిగే సభలు ఎవ్వరివి ?
సమకాలీన సమ కవుల
సప్తతి సభలు మువ్వురివి !
నందినీ నాళేశ్వరం
కందుకూరి శ్రీరాములు !
సాహితిలో ఒక్కసారి
అడుగుపెట్టిన స్వాములు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

అయన తెలంగాణకు లభించిన గొప్ప వరం..

కొందరు అంతే ఏదీ ఆశించరు. సమాజానికి ఏదొకటి చేయాలని తపిస్తుంటారు. ఇప్పటికే ఎంతో చేశారు. ఇంకా ఎంతో చేయాలని వయసును సైతం లెక్క చేయకుండా బాధ్యతను గుర్తు చేసుకుంటూ వారి దారిలో వారు నిస్వార్థంగా కృషి చేస్తుంటారు. అలాంటి మహోన్నత వ్యక్తుల్లో నేను దగ్గరగా చూసిన మహా అద్భుతమైన వ్యక్తిత్వం బి. నర్సింగరావు. ఆయన తెలంగాణలో గొప్ప విశిష్ట వ్యక్తి! ప్రపంచంలోని కళలను పుక్కిటపట్టి తెలంగాణ ను కూడా ఆ స్థాయిలోకి తీసుకెళ్లాలని ఇప్పటికీ విశేష కృషి చేస్తుంటారు 79 ఏళ్ల వయసులో సైతం. నర్సింగరావు గారిని కేవలం తెలంగాణ సినిమా దర్శకుడు అని పరిచయం చేయలేం. అతనొక రచయిత, కవి, చిత్రకారుడు. అతనొక నడిచే ఎన్–సైక్లోపీడియా. ఆతనొక తెలంగాణ సాధన ఉద్యమ వెలుగు బావుటా!

నర్సింగరావు గారికి వయసు ఒక నెంబర్ మాత్రమే. సమాజం కోసం ఏదొకటి చేయాలని తపన ఉండాలి కానీ, వయసుతో సంబంధం ఏముందని వారిని చూస్తే, వారితో కాసేపు మాట్లాడితే అనిపిస్తుంది. వెనుకపడిన దగాపడిన తెలంగాణలో సాంస్కృతిక చైతన్యం తీసుకురావాలని తన వంతు బాధ్యతగా తన అనుభవాన్ని రంగరించి భావి యువత కోసం ప్రపంచ స్థాయి వైవిధ్య ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం తగిన రీతిలో ఆయనకు కాస్త భరోసాగా ఉంటే, నిజంగానే తెలంగాణ సాంస్కృతిక రంగం వైపు మిగిలిన రాష్ట్రాలు చూసేలా ఆయన రూట్ మ్యాప్ తయారు చేశారు. ఒక్క సాంస్కృతిక రంగం మాత్రమే కాదు, పురావస్తు శాఖ, సినిమా రంగం అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక సిద్ధం చేశారు.

ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులతోనూ చర్చిస్తున్నారు! తెలంగాణలో సమగ్ర సాంస్కృతిక సినిమా అభివృద్ధికి, తద్వారా తెలంగాణ ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలనేది నర్సింగరావు గారి కల. ఆ కలను నిజం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేకంగా నర్సింగరావు గారిని ఆహ్వానించి గద్దర్ తెలంగాణ సినిమా అవార్డ్స్ కమిటీకి చైర్మన్ గా నియమించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం గత పదేళ్లుగా జరగని సినిమా నంది పురస్కారాల ప్రదానోత్సవం ఇప్పుడు తెలంగాణ ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరుతో రానున్న ఉగాదికి కొత్తగా వేదికపైకి రానున్నాయి. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవకు, నర్సింగరావు గారి ఆలోచనలకు దర్పణం పట్టి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురానున్నాయి.

మొదటి నుంచి కూడా నర్సింగరావు గారికి నేనంటే ఇష్టం. కళల పట్ల నాకున్న అంకితభావం ఆయనకు ఇష్టం. అందుకే అప్పుడప్పుడు కలుస్తుంటాం. వివిధ అంశాలపై చర్చిస్తుంటాం. ఇది చాయ్ పే చర్చ లాంటిది. వారి ప్రేమకు నేనెప్పుడూ ఫిదా అయిపోతుంటాను. ఇద్దరికి మూడు దశాబ్దాలకు పైగా వయసు తారతమ్యం వున్నా ఆయన ఇట్టే కలసిపోతుంటారు. అయనతో సమయం ఇట్టే గడచిపోతుంటుంది. ఆయన జోక్స్ భలే కట్ చేస్తారు. ప్రతి విషయంలోనూ ఆయన అప్డేట్ అయ్యే తీరు గొప్ప స్ఫూర్తినిస్తుంటుంది. ఎంతో హుందాగా మరెంతో సింపుల్ గా వుండే నర్సింగరావు గారు నాకొక గొప్ప ఇన్–స్పిరేషన్. ఆయన తెలంగాణకు లభించిన గొప్ప వరం!

–మహ్మద్ రఫీ

ములుగు మన్నెంలో జాతరల సందడి

మేడారం, ఫిబ్రవరి 12:మేడారం చిన్నజాతర బుధవారం ఉదయం ప్రారంభమైంది. వడ్డెలు సమ్మక్క–సారలమ్మ కొలువైన మేడారం, కన్నెపల్లికి ద్వారా బంధనం చేసి జాతర ప్రారంభించారు. పొలిమెర దేవతలకు పూజలు నిర్వహించారు. ఈరోజు పూజారులు ఉపవాస, జాగరణ చేస్తారు. ఆదివాసీలు మేడారం, కన్నెపల్లిలోని సమ్మక్క ఆలయాలకు అలుకుపూత చేసి శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. వన దేవతల మినీ జాతరకు భక్తులు తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. సమ్మక్క పుట్టిన బయ్యక్కపేట, సారలమ్మ జన్మించిన కన్నెపల్లి, జంపన్న, నాగులమ్మ కొలువైన కొండాయి, పగిడిద్దరాజు కొలువైన పూనుగొండ్లలోనూ జాతరల సందడి నెలకొంది. ములుగు శివారు గట్టమ్మ ఆలయం దగ్గర భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు మేడారం చిన్నజాతరకు వెళ్తూ గట్టమ్మను దర్శనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ములుగు మన్నెంలో జాతరల సందడి నెలకొంది.

మేడారం జాతరలో కోడిని గద్దెల వైపు ఎగురవేసి ఎదురుకోళ్ల మొక్కు సమర్పిస్తారు. అక్కడే విడిది చేసి వండుకొని బంధుమిత్రులతో విందు చేసుకుం టారు. అయితే.. పలు జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ఫ్లూ సోకుతుం డటం, ప్రభుత్వం అప్రమత్తమై కొద్దిరోజులు చికెన్ తినొద్దని సూచి స్తున్న నేపథ్యంలో చిన్న జాతరపై ప్రభావం పడనుంది. బ్రాయిలర్ కోళ్లను తీనవద్దని ప్రభుత్వం చెప్పడంతో నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది. దీంతో మేడారంలో బ్రాయిలర్ కోళ్లకు డిమాండ్ తగ్గింది.శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో అర్జిత సేవలు రద్దు

ములుగు మన్నెంలో జాతరల సందడిములుగు ఏజెన్సీలో జాతరల సందడి నెలకొంది. ఆదివాసీలు తమ ఇలవేల్పులను కొలుచుకొనే వేడుకలతో గూడేలు పండగ వాతావరణం సంతరించుకున్నాయి. తాడ్వాయి మండలం మేడారంలో సమ్మ క్క సారలమ్మ చిన్నజాతర బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఈ నెల 15 వరకు నాలుగు రోజులపాటు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. తొలిరోజు సమ్మక్క కొలువైన మేడారంతోపాటు సారలమ్మ కొలువుదీరిన కన్నెపల్లిలోని పూజా మందిరాలను శుద్ధిచేసి అలుకుపూతలు చేశారు. గ్రామాలకు ద్వారబంధనం విధించి పొలిమేర దేవతలకు పూజలు నిర్వహించారు. రాత్రివేళ వనదేవతల గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి జాగరణ చేస్తారు. వనదేవతలుగా కీర్తించబడుతున్న సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, నాగులమ్మ నడయాడిన అడవి పల్లెల్లో అక్కడి గిరిజనులు అనుబంధ జాతరలను జరుపుతున్నారు. సమ్మక్కకు పుట్టినిల్లయిన తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో కూడా బుధవారం నుంచే జాతర మొదలైంది.

తిరుపతిలో తొక్కిసలాటపై సీబీఐ విచారణ.. హైకోర్టు కీలక నిర్ణయం

తిరుపతి, ఫిబ్రవరి 12: వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి టికెట్ల జారీకి ముందు జరిగిన తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ సంఘటనపై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణకు ఆదేశించిందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలియజేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతో.. వేరే విచారణ అవసరం లేదని హైకోర్టు బుధవారం స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో సీబీఐ విచారణ జరపాలంటూ దాఖలైన పిల్‌ను కొట్టివేసింది. ఇక ఇదే అంశంపై ఈ రోజు మరో పిల్ దాఖలు చేసింది. దీనిని సైతం హైకోర్టు కొట్టివేసింది. టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటపై సీబీఐ విచారణ జరపాలంటూ.. కర్నూలుకు చెందిన ప్రభాకర్ రెడ్డి ఏపీ హైకోర్టులో గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు.ఇంతకీ ఏం జరిగిందంటే.. 2025, జనవరి 10వ తేదీ ముక్కోటి ఏకాదశి. ఈ నేపథ్యంలో తిరుమలలో 10 రోజుల పాటు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఆ క్రమంలో జనవరి 9వ తేదీ తెల్లవారుజాము నుంచి టోకెన్లు జారీ చేయనున్నట్లు టిటిడి ప్రకటించింది.

అందుకోసం తిరుపతిలోని ఎనిమిది ప్రాంతాల్లో 94 టోకెన్ జారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పిల్లాపాపలతో సహా భారీగా తిరుపతికి వచ్చి చేరుకున్నారు. అయితే బైరాగి పట్టెడ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో సిబ్బంది ఒకరు తీవ్ర అస్వస్థ తకు గురయ్యారు. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించేందుకు క్యూ లైన్ గేట్‌ను తెరిచారు.

హైదరాబాద్ శివారులో క్యాసినో గుట్టు రట్టు.. 64 మంది అరెస్టు..

హైదరాబాద్, ఫిబ్రవరి 12: నగర శివారులో భారీ క్యాసినో ను పోలీసులు పట్టుకోవడం కలకలం రేపింది. మొయినాబాద్‌లోని ఫామ్ హౌస్ పై దాడి చేసిన రాజేంద్రనగర్ నగర్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం రాత్రి బృందాలుగా విడిపోయి దాడులు చేశారు. అక్కడున్నవారి అందరినీ అదుపులోకి తీసుకున్నారు. లోపల ఉన్నవారు బయటకు వెళ్లకుండా పోలీసులు ఫామ్ హౌస్‌ను చుట్టుముట్టారు. రూ. 30 లక్షల నగదు, 55 లగ్జరీ కార్లు సీజ్ చేశారు.ఈ కోడి పందెం కోసం తీసుకొచ్చిన 86 పందెం కోళ్ళు.. పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాయిన్స్, పందెం కోళ్ల కోసం వాడే 46 కోడి కత్తులు కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని నడుపుతున్న నిర్వాహకులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్వహిస్తున్న నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జూదంలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

మాఘపూర్ణిమ సందర్భంగా

కుంభ మేళాకు పోటెత్తిన భక్తజనం..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:మహా కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. ఈరోజు మాఘ పూర్ణిమ సందర్భంగా మామూలు రోజుల కంటే పెద్ద ఎత్తున వస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల నాటికే 73.60 లక్షల మంది పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈరోజు త్రివేణి సంగమంలో స్నానం చేసిన వారు, వారి జీవితంలోని కష్టాల నుంచి విముక్తి పొందుతారని పండితులు భావిస్తున్నారు. వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో మహా కుంభమేళా ప్రాంతానికి చేరుకునే క్రమంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతోంది.

సీఎం పర్యవేక్షణ

మాఘ పూర్ణిమ సందర్భంగా భక్తుల రద్దీ నిరంతరం పెరుగుతోంది. దీంతో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు 15 జిల్లాల ఆఓలు, 20 మంది ఎఆలు, 85 మంది ఖఆూ అధికారులను విధుల్లో మోహరించారు. అలాగే, సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఉదయం 4 గంటల తర్వాత వార్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఆయనతో పాటు డీజీ ప్రశాంత్ కుమార్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా భక్తులకు సౌకర్యాలు అందించేందుకు అన్ని సన్నాహాలు చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు భోజనాలు, పర్యాటక సౌకర్యాలు అందించడం సహా వారి ఆధ్యాత్మిక ప్రయాణం సాఫీగా సాగేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

స్నానం ప్రాముఖ్యత

మత విశ్వాసం ప్రకారం ఈరోజు దేవతలు భూమిపై వస్తూ త్రివేణి సంగమంలో స్నానం చేస్తారని, తద్వారా భక్తులు శాంతిని, మోక్షాన్ని పొందగలుగుతారని ఇంకొంత మంది పండితులు అంటున్నారు. అందుకే మహాకుంభమేళాలో ఈ రోజు స్నానం అత్యంత పవిత్రమైన రాజస్నానంగా పరిగణించబడుతుందని చెబుతున్నారు. 2025 ఫిబ్రవరి 11 సాయంత్రం 6:55 నుంచి ఫిబ్రవరి 12 సాయంత్రం 7:22 వరకు మాఘపూర్ణిమ స్నాన సమయం కొనసాగుతుంది.

ఈరోజు ఉదయం స్నానం చేయడానికి శుభ సమయం 05:19 నుంచి 06:10 గంటల వరకు ఉంది. ఈ సమయాన్ని అనుసరించి భక్తులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేసి వారి సమస్యల నుంచి విముక్తి పొందుతారని పండితులు భావిస్తున్నారు. ఇప్పటికే మహా కుంభమేళాకు 40 కోట్ల మందికిపైగా వచ్చారు. ఈ క్రమంలో మహాశివరాత్రి ఫిబ్రవరి 26, 2025 వరకు కొనసాగనున్న ఈ మేళాకు మరింత మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది.

జీహెచ్ఎంసీ కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తిస్తుంది..

హైదరాబాద్, ఫిబ్రవరి 12:జీహెచ్ఎంసీ కార్మికులు చేస్తున్న సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జనసమితి మద్దతు ఇచ్చిన ఐఎన్‌టీయూసీ అనుబంధ మునిసిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జరిగిన జీహెచ్ ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, సత్యజిత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి శివకుమార్, టీజేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుగనుల్లో సింగరేణి చైర్మన్ ఆకస్మిక తనిఖీ

అమరావతి, ఫిబ్రవరి 12:సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, శ్రీరాంపూర్ ఏరియాలోని గనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు, ఉద్యోగులతో మాట్లాడితే తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్, ఎల్వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె 7, న్యూటెక్, ఆర్కె 5, ఆర్కే 6, సిహెచ్పి , ఎస్ఆర్పి ఓసీ గనుల్లో ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం ఆర్కే న్యూటెక్ గనిలో అండర్ గ్రౌండ్ కి వెళ్లి పని ప్రదేశాలను పరిశీలించారు.

రైతుల కళ్ళలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం.. యశస్విని రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 12: రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని కర్కాల గ్రామంలో చెక్ డ్యామ్ నీటి ప్రవాహాన్ని, వెలికట్ట శివారు పెద్ద మంగ్య తండా వరిధిలోని ఎస్సారెస్పీ కాల్వలను రైతులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

ఈ సందర్భంగా.. ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సాగునీటి సమస్య రాకుండా అధికారులతో మాట్లాడి బయన్న రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేయిస్తే బీఆర్ఎస్ నాయకులు తాము సాగునీరందించామని ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. రైతులకు అందుబాటులో ఉండి కష్టపడేది ప్రజా ప్రభుత్వమైతే తాము చేశామని ప్రతిపక్షాలు ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సాగునీరించేందుకు అధికారులతో మాట్లాడి మైలారం రిజర్వాయర్ ద్వారా 8 చెక్ డ్యామ్‌లను నింపడం జరిగిందన్నారు.

పెద్ద మంగ్య తండ పరిధిలో కెనాల్ కాలువలో గత ప్రభుత్వ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల మధ్యలో బండ ఉండడంతో వదిలిపోయారని, దీంతో రైతులు నష్టపోకుండా తన సొంత ఖర్చుతో బండను తొలగించి సాగునీటిని అందించామన్నారు.

తమ ప్రభుత్వం చేసిన పనులను బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఇప్పటికైనా మతిభ్రమించి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, తొర్రూర్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, ధరావత్ సోమన్న, మాలోత్ సునీత రాజేందర్, కిషన్ యాదవ్, గౌతమ్ రెడ్డి, ప్రసాద్, ఎర్ర వెంకటరెడ్డి, వెంకన్న యాదవ్, అలువాల సోమయ్య, ఎర్ర మల్లారెడ్డి, జాటోత్ రవి నాయక్, జాటోత్ రాం లాల్, జాటోత్ సంతోష్, జాటోత్ శీను, యూత్ నాయకులు రాజేష్ యాదవ్, మహేష్ యాదవ్, ప్రవీణ్ నాయక్, పరశురాములు, రమేష్ నాయక్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో భారీ అగ్ని ప్రమాదం

అమరావతి, ఫిబ్రవరి 12:విజయవాడలో ఇవాళ మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సితార సెంటర్ లోని కాశ్మీర్ జల కన్య ఎగ్జిబిషన్ లో అగ్ని ప్రమాదం జరి గింది. దీంతో భారీగా మంటలు ఎగిసిపడు తున్నాయి. లోపల గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ ప్రమా దం జరిగింది.సమాచారం తెలుసుకున్న భవానీ పురం పోలీసులు హుటాహుటిన ఎగ్జిబిషన్ ప్రాంతానికి చేరుకొని ఫైర్ సిబ్బందితో కలసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మూడు అగ్నిమాపక వాహనాలు అక్కడికి చేరుకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేట కథలు – సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 12:సాహిత్య అకాడెమీ – స్ఫూర్తి సాహితీ సమాఖ్య, యానాం సంయుక్త ఆధ్వర్యంలో 'వేట కథలు–సదస్సు'సర్వశిక్షాభియాన్ సమావేశ మందిరం, యానాంలో ఫిబ్రవరి 23, ఆదివారం 2025 తేదీన ఉదయం 10 గంటల నుండి జరుగుతుంది. ప్రారంభ సభలో సి. మృణాళిని, చింతకింది శ్రీనివాసరావు, ఆర్. మునిస్వామి, దాట్ల దేవదానం రాజు, రత్నాకర్ పెనుమాక పాల్గొంటారు. అల్లం శేషగిరిరావు కథలు, జె.పి. వైద్య కథలు, కె. ఎన్.వై. పతంజలి కథలు, పూసపాటి కృష్ణంరాజు కథలు ఇంకా ఇతర రచయితల వేటకథలు గురించి వాసిరెడ్డి నవీన్, అవధానుల మణిబాబు, వరుగు భాస్కరరెడ్డి, కె. నీరజ, మందలపర్తి కిశోర్, అద్దేపల్లి ప్రభు, కె. శైలజ ప్రసంగిస్తారు.

– దాట్ల దేవదానం రాజు
స్ఫూర్తి సాహితీ సమాఖ్య, యానాం.

ఉగాది బాలల కథల పోటీకి 372 కథలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12:సిద్దిపేట కు చెందిన సుగుణ సాహితి సమితి ఉగాది సందర్భంగా ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశాలల విద్యార్థుల నుండి జిల్లా స్థాయి బాలల కథల పోటీ –2025 కి కథలు ఆహ్వానించగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 29 పాఠశాలల నుండి 372 కథలు రావడం సంతోషంగా ఉందని సుగుణ సాహితి సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య బుధవారం సిద్దిపేటలో కథల వివరాలు ప్రకటించారు. లక్ష్మీదేవిపల్లి –08, సిర్సన గండ్ల –1,

జక్కాపూర్ –17,రామునిపట్ల–4, కుకునూరుపల్లి–10, కొండపాక బాలికలు –8,సికింధ్లాపూర్–2, బెజ్జంకి – 10,శనిగరం–55,ఆదర్శ పాఠశాల బెజ్జంకి –19

బక్రిచెప్యాల–20, రేగులపల్లి–9 అనంత సాగర్ –22,మర్పడగ–3, రామంచ–20, రాజ గోపాల పేట–14, ఎల్లా రెడ్డి పేట–34,చౌదారం –4,సముద్రాల–2, దౌల్తాబాద్ –19,ఘన పూర్ –22, నర్సాయపల్లి –9,ఎన్సాన్ పల్లి –3,శ్రీగిరిపల్లి –22,చిన్నకోడూర్ –20,చందాపూర్ –12,వెంకట్రావు పేట –1 ప్రభుత్వ పాఠశాలతో పాటు ,మెరిడియన్ –1,శ్రీ చైతన్య స్కూలు –1కథలు వచ్చాయని ,గత ఐదు సంవత్సరాలతో పోల్చుకుంటే ఈ సంవత్సరం ఎక్కువగా కథలు వచ్చాయని,ఈ కథలు న్యాయ నిర్ణేతలకు పంపించి మార్చ్ నెలాఖరు లో ఫలితాలు ప్రకటించి,బహుమతులు అందిస్తామని కన్వీనర్ చెప్పారు.కథలు వ్రాసిన చిన్నారులు,వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు,తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

ఆహ్వానం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
తెలంగాణ రచయితల సంఘం-జంట నగరాలు
కందుకూరి శ్రీరాములు డా.నాళేశ్వరం శంకరం డా.నందిని సిధారెడ్డి
ముగ్గురు కవుల సప్తతి సభలు
16.ఫిబ్రవరి 2025, ఉదయం 10.00 గం॥ లకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
పారంభ సమావేశం
ఉ.10.00 నుంచి మ.11.30 గం॥ వరకు
ఆహ్వానం : డా. కొండపల్లి నీహారిణి
సభాధ్యక్షత : బైస దేవదాసు
ముఖ్య అతిథి : దేశపతి శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు
విశిష్ట అతిథులు : డా. మామిడి హరికృష్ణ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు
: దేవీ ప్రసాద్, తెలంగాణ ఉద్యమ ఎన్జీవో నాయకులు
: విరాహత్ అలీ, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు.
సప్తతి మొదటి సభ
ఉ.11.30గం. నుంచి మ.1.00 గం. వరకు
కవి : కందుకూరి శ్రీరాములు
ఆహ్వానం : నరేశ్ చారి
సభాధ్యక్షత : డా.బెల్లంకొండ సంపత్ కుమార్
ప్రసంగం : డా.తూర్పు మల్లారెడ్డి
కవి భాషణం
సప్తతి రెండవ సభ
మ.1.30గం. నుంచి మ.3.30 గం. వరకు
కవి : డా.నాళేశ్వరం శంకరం
ఆహ్వానం : కందాళై రాఘవాచార్య
సభాధ్యక్షత : డా.రూప్ కుమార్ దబ్బీకార్
ప్రసంగం : డా.ఏనుగు నరసింహారెడ్డి
కవి భాషణం
సప్తతి మూడో సభ
మ.3.30గం. నుంచి సా.5.00 గం. వరకు
కవి : డా. నందిని సిధారెడ్డి
ఆహ్వానం : గుండెళ్లి ఇస్తాలి
సభాధ్యక్షత : డా.పాశిరెడ్డి రంగయ్య
ప్రసంగం : డా. వి. శంకర్
కవి భాషణం
వందన సమర్పణ : గడ్డం సులోచన

చురక

ప్రశ్నిస్తే బంధిస్తరు
పంజరంలో చిలకలాగ
వట్టిగరిస్తే కావు కావు
వదిలేస్తరు కాకిలాగ
ఎదిరిస్తే ఎవరినైనా
ఎక్కడైనా అణచడమే
అధికారం ఎవరిదైనా
ఐక్యతను తునచడమె

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికి అందం

వర రచయిత్రి సరోజిని
పెరవారలతోడ బోర–ప్రియమగు రీతిన్
జరుపంగావలె నామెను
మరిమరి స్మరియించు కొనుచు మహిళా దినమున్!!
(ఫిబ్రవరి 13 జాతీయ మహిళా దినోత్సవం)

–రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 13-2-2025

పుస్తక సమీక్ష

రసరమ్యంగా జాలువారిన గజల్ సంపుటి "ఆద"

రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గజల్ వాగ్గేయకారిణి. మల్లీశ్వరి గారి లేఖిని నుండి రసరమ్యంగా జాలువారిన గజల్ సంపుటి "ఆద" పాఠకుల హృదయపు లోతులను స్పృశిస్తుంది. వీరు ఆరు ప్రపంచ రికార్డులను కైవసం చేసుకున్నారు. బాల సాహిత్యం – గేయ ప్రక్రియ, నవల, కథలు, లేఖా సాహిత్యం, వ్యాసరచన, వాచక నిర్మాణం మొదలైన వివిధ సాహితీ ప్రక్రియలను స్పృశించి ఆరితేరిన అతివగా ప్రఖ్యాతి వహించారు. అనేక పురస్కారాలను అందుకొన్నారు. ఆ పురస్కారాలకే మల్లీశ్వరి మహిళామణి అలంకారంగా భాసించారు. వీరు గజళ్ళ సంపుటికి పెట్టిన పేర్లు కూడా వైవిధ్యంగా ఉన్నాయి. అనంతమైన భావసంపదను పదాలలో ప్రతిక్షేపించి మనోజ్ఞంగా ఉపమించి చెప్పిన భాషామతల్లి ఈ మల్లీశ్వరి. ఉత్తమ పురుష కథనంతో రాసి మానసిక ఆలోచనలను, వ్యథను, జీవనవిధాన విభిన్నతను ఈ ఆద గజళ్ళలో చూపించారు. ఈ సంపుటి పర్యాయ పదకోశంగా శోభిస్తోంది.

సవనం– పవనం– హవనం – దవనం మొదలైన పదాలను పేర్చి గజల్ కు అందాన్ని అద్దారు. కొన్ని గజల్స్ ఏమనను, చూచావా, నాకివ్వు, ఎందుకని అంటూ ప్రియా అని సంబోధిస్తూ చెప్పారు. బంధుత్వాల బాటలో ఆప్యాయత – ఆదరణ తొణికిసలాడాలని రచయిత్రి కాంక్షించారు. ఆర్థిక – సామాజిక స్థితి గతులను తెల్పుతూ పదాల పోహళింపుతో పాఠకులకు పరోక్షంగా ప్రశ్నలను అనుసంధానించారు. సమాధానం కూడా తెలిపి మనసు పొందే హేలను, మనస్సును మంచి పదాలతో మెలిపెట్టి చూపించారు.

ఈ మనస్సు కవయిత్రి ఆద గజల్ సంపుటిలో 50 అంశాలను ప్రస్తావించారు. మన సుకవయిత్రి మల్లీశ్వరి ఆద అంటే "మనస్సు" అని, ఆద అంటే "బాధ" అవి అర్థాన్ని కూడా తెలిపారు. ఈ మనస్సు సాగర తరంగాల తూగులాటలో, బాధల వలయంలో సతమతమవుతూ ఉంటుంది. ఆవలితీరం కనుచూపు మేరలో లేదని, జీవితసత్యాలను పదాల ద్వారా గజల్ గమనంలో తెలిపారు. మానవ జీవనయానంలో ఆటుపోట్లు తప్పవని చెప్పారు. ఆద సంపుటిలోని గజల్స్ పాడినా, విన్నా, చదివినా ఆశాపూరిత హృదయం కనిపిస్తుంది. చిగురంత ఆశ చిగుర్చునన్న ఆకాంక్షతో మనిషి ముందుకు సాగిపోవాలని అవగతమవుతోంది. సమాజంలో, కుటుంబంలో, నిత్య జీవితంలో స్త్రీ సహకారం అందరికీ అన్నివేళలా ఉంటుంది. స్త్రీ అంటే ఓరిమికి, చెలిమికి, స్నేహశీలతకి ప్రతిరూపం అని వీరి ఆద గజల్స్ ద్వారా అవగతమవుతోంది.

స్నేహ సౌరభ సోయగాల లోకాన
మనసైన మల్లికనైనా ప్రియా
చైత్రమే చేరి మేలిమైత్రాన్ని
చల్లదనంలా చల్లి కనైనా ప్రియా–33

స్నిహ్యతే అనేన ఇతి స్నేహం, నూనె జిడ్డును విడిచి పెట్టకుండా ఉంటుంది. అదే స్నేహం. అలాగే వసంత సోయగాన్ని చైత్రం తెస్తుంది. చైత్రమంటే– ఒక స్రవంతి, అదే విధంగా బాల్యం తిరిగిరాని అమూల్య కాలం ఇది. బాల్యాన్ని వసంత కాలపు ప్రకృతి రామణీయకతతో పోల్చి చెప్పిన మల్లీశ్వరి గారి పరవశత్వం మానసిక ఆనంద హేలలో ప్రతిష్ఠితమై పద రూపంలో దర్శన బాల్యం అలాగే ఉండిపోదు. వసంతం కూడా అంతే. ఇది కాలానుగుణమైన మార్పు. ఇది సహజం, విషాదం కూడా అంతే ఏదీ శాశ్వతంగా నిల్చి ఉండిపోదు. రాత్రి వెంట పగలు, విషాదం వెంట నవ్వులు ఉంటాయి అన్నారు.

మానవత్వపు లోగిళ్ళ బాటలన్నీ మూసుకు పోతున్నాయి. హింసా ప్రవృత్తి తాండవిస్తోంది. అహింస అనే ఆయుధం దృశ్యమానం కావాలని, అటువంటి మానవ సమాజాన్ని వీక్షించడానికి రచయిత్రి ఆరాటపడ్డారు. పూసిన పూలు వాడిపోయి రాలిపోతాయి. కోరికలు కూడా అంతే. మమతలు కనుమరుగవుతున్నాయి. తారలు నిరంతర స్వయం ప్రకాశకాలు. చెలిమి చేరని క్షణాలన్నీ వీగిపోతున్నాయి. అద్దం ఆదర్శం అది కాంతి ప్రతిబింబం అదే మాయ. జీవి జనన మరణాలకు బద్ధుడు. ఈ జనన మరణ చక్రభ్రమణం మాయతో కూడినదన్నారు. ఇందులో జీవి కొట్టుమిట్టాడవలసిందే జీవి జీవనయానం మాయ. ఏది లేదో అది మాయ. "యామాసామాయా" మాయ అంటే శూన్యం, సున్న. సున్న పరిపూర్ణత్వానికి ప్రతీక, కనుక ప్రేమపాశంతో బంధింపడినా, అతీతమైన ఆలోచనా ధోరణితో ఈ చక్రంలో పయనిం చాలి. ప్రతిజీవి ఏకాకి. ఎవరూ ఎవరితో రారు. ఎవరి పరీక్ష వారే వ్రాయాలి. వారివారి కృషినిబట్టి ఫలితం ఉంటుంది. ప్రాణం పోకడ వాన రాకడ తెలియవు అని ఆద గజల్స్ ద్వారా చెప్పారు.

కాలం చాలా విలువైనది. మానవత వెలకట్టలేనిది. ఐకమత్యపు బలాన్ని మనిషి విస్మరిస్తున్నాడు. అందువల్ల సమస్యల వలయంలో చిక్కుకుపోతున్నాడని రాసారు. ఈ విషయాన్ని "ఐదు



– రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
సా మ్రీ, 501, సీతా రెసిడెన్సీ,
బ్రాహ్మణవాడి, బేగంపేట్,
హైదరాబాద్, –16
సెల్: 9866583907

వేళ్ళు కలిసుంటే ....." అనే గజల్ ద్వారా పాఠకులకు ప్రేరణ నిచ్చారు. గతం పదే పదే స్ఫురణకు వస్తుంది. ఇది మానవ నైజం. గతకాలపు ఆలోచనలు, ఊహలు, బాధలు, ఇక్కట్లు స్త్రీలకు మరీ అధికంగా గుర్తుకు వస్తాయి. నిన్నటి రోజు నేడు, నేటి రోజు రేపు నిలబడవు. కాలం ఆగదు కొన్ని ఎదురు దెబ్బలవల్ల మనస్సుకు శస్త్ర చికిత్సలు జరుగుతాయి. కాలం ఒక వాహిని, ఆనందంతోపాటు స్వార్థాన్ని నిర్దయని, ప్రణయాన్ని ప్రళయాన్ని కళ్ళముందు నిలబెడుతుంది. అని మనముందు నిలబడే వరకు మనకు తెలియదు. ఆఘోషను ఎదుర్కొనే శక్తి చూస్తూ నిలబడే శక్తి, కాలానికి ఎదురీదే యుక్తి ఒక్క మనస్సుకు మాత్రమే ఉంటుంది. అందుకే ఇది ఆద. నే స్వప్న వల్మీకమైనానా....." అనే గజల్లో

"హృద్యనై హృద్యమై ముద్దుగారే
హృదితో విరిశానా
ఆకాశమే హృదయ మంటున్న
విడువకున్నది ధ్వాంతం – 7

గుండె, మది, మనస్సు, మనసులో మెదిలే భావనలకు హృదయ కుహరమే స్థానం. హృదయమంటే కేంద్రం, హృదయ వర్ణన కేవలం మానసిక భావన. హృదయమంటే కేవలం రక్తప్రసరణ చేసే అవయవం మాత్రమే కాదు, మనస్సు అంటే హృదయమే. ప్రాణికోటికి మనస్సు ఉంటుంది. అది సమస్త అవయవాలలో ప్రధానమైనది. మనసు ఒక చీకటి గుహ, అక్కడ ధ్వాంతం, అదే చీకటి, చీకటి అజ్ఞానానికి ప్రతీక. చీకటిలో ఏముందో తెలియదు. మనసు నిలకడగా ఉండదు. వేగంగా ప్రయాణిస్తుంది. చీకటి శాశ్వతంగా ఉండిపోదు. ఆకాశం అంటే శూన్యం ఏమీ లేదు అని చెప్పాలి సూర్యోదయంతో అంధకారం పటాపంచలవుతుంది. మానవ లోకంలో మాత్రం ఈతి బాధలవల్ల మనస్సు మథించబడుతుంది. అయినా సూర్యోదయం ఒక ఆశాకిరణం. ఇది సహజం. నేటి లోకం పోకడము మల్లీశ్వరి చాలా చక్కగా చెప్పారు. ఈ గజల్లోనే రచయిత్రి "ప్రజ్ఞానమవని ప్రకాశపు ప్రభల వెలుగకున్నది ప్రాంతం" అని వ్రాసారు.

ప్రకృష్టమైన జ్ఞానం ప్రజ్ఞానం విద్ జ్ఞానే అని ధాతువు

జ్ఞానం అంటే చైతన్యం, కాంతి, తనను తాను ప్రకాశింపజేసుకుంటూ ఇతరులను ప్రకాశింపజేస్తుంది. ప్రాకశమనే ప్రభలో ప్రాంతం ప్రకాశించడం లేదని వాపోయారు. మంచి రోజుల కోసం ఓర్పుతో వేచి ఉండాలని సందేశమిచ్చారు.

"క్షణాలెన్నో వస్తూ పోతూ మనిషిని
తొలిచి సురంగం చేస్తాయి.
స్వార్థ నిస్వార్థాలు మనసును
నిలకడలేని పతంగం చేస్తాయి" – 32

ఈ గజల్ ద్వారా మనసుకు నిర్వచనం తెలిపినట్లుగా అనిపిస్తుంది. స్వార్థం (స్వ+ అర్థం = తన అర్థంలో తనకు), నిస్వార్థం (ని :– ఉపపర్గ) ఈ రెండూ మనసును చలింపజేస్తాయి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు చెప్పినట్లుగా మనసు తెగిన పతంగం. మాయల దెయ్యం, మనసులోని ఊహలు మన మనసుతోనే ఊసులాడుకుంటాయి. మనసు మబ్బుతొలగాలి. మబ్బు వెనుక రవి ఉన్నప్పుడు మబ్బు విడిపోతేనే కాంతి కనిపిస్తుంది. మనస్సు స్వచ్ఛత కూడా అంతే అలాగే కనిపిస్తుంది. ఇక్కడ స్వార్థ పరార్థాలు రెండూ రచయిత్రి వైపే ఉన్నాయనిపిస్తుంది.

"చీకటి చెట్టుకు పూసిన ఆశల పూల
నెగళ్ళు నాకళ్ళు
కొమ్మలోచనా వల్లరుల వినిపించు
సందళ్ళు నాకళ్ళు" – 11

చీకటి – వెలుగు, ఆశ – నిరాశల తారతమ్యాన్ని తెలిపారు. ఆశ మెరుస్తూ ఉంటుంది. కొమ్మ లోచనా వల్లరుల వినిపించే సందళ్ళు ఈమె కళ్ళు. కొమ్మ అంటే స్త్రీ. కొమ్మ అంటే చెట్టు కొమ్మ. రచయిత్రి భావుకత ప్రశంసనీయం. కళ్ళల్లో మనసులో ఉన్న భావాలు వ్యక్తమవుతాయి, మనసులో మాటలను కళ్ళల్లో దాచలేం, దీనిని రచయిత్రి పదాలలో చూపించారు.

"ప్రేమంటే పరామర్శల క్రీడ కాదు. వేదన కాదు. నేరం కాదు. వేధించడమూ కాదు. మమత పంచే ఎదను బాధించడం కాదు. బీళ్ళు మొలిపించడం కాదు. మోళ్ళు చిగురించడం కాదు. చిమ్మ చీకటిలో వెలుగై దారి చూపించడం కూడా కాదు" ప్రేమ అంటే మోహవశమైన హృదయం అవవచ్చు. ప్రియం అంటే ఇష్టత, ప్రియస్య భావః ప్రేమా ప్రియం యొక్క భావము ప్రేమ. ఇది ప్రియత అవబడుతుంది. ప్రీణనం ప్రేమ, ప్రీఞ– తర్పణే అని ధాతువు. ప్రీణనం అంటే తృప్తిని కల్గించేది.

ప్రేమ పంచే హృదయం సదా గుర్తిస్తూ ఉంటుంది. ఆ ఊహలు, తలపులు, భావాలు నిద్రలో కూడా అవే ఆలోచనలు లేదా అప్రయత్నంగా అల్లుకు పోతాయి, మేల్కొంచినపుడు ఇవే అనంతమైన శక్తినిచ్చి నడిపిస్తాయి. ఇదే ఆశ. మానవుడు ఆశాజీవి. ప్రేమ గొప్పది. ఒంటరితనాన్ని పోగొడుతుంది. ప్రేమ పరోక్షంగా శిక్షిస్తుంది కూడా. రచయిత్రి కలలో ప్రేమ అనే రెండక్షరాలు కలిగి ప్రవహించి మిణుగురు పురుగు వలె మినుకు మినుకు మంటూ కనిపిస్తూ చిత్రీకరింపబడ్డాయి.

మల్లీ ! విధి విన్నాణమెరుగని శోక
వడగళ్ళు నాకళ్ళు – 11

ఈ భావన కూడా చాలా బాగుంది. విధి బలీయమైనది. విజ్ఞానంతో పనిలేనిది. అంటే ఎరుగనిది ఎరిగినా తిరుగులేనిది. ఈమె కన్నీళ్ళు కంటిలో ఇంకిపోలేదు. ఆద వల్ల బరువుగా కన్నీళ్ళు రాలాయి. వడగండ్లు నేలమీద పడి కరిగి నీరుగా అవుతాయి. మనసు మూగబాధ బరువుగా నడుస్తుంది. కన్నీళ్ళు బరువుగా రాలాయి. నీళ్ళు కనుమరుగవడం వీటి సహజగుణం.

బాధలలో ఓదార్పు అవసరం. జీవితం మీద ఆశలను ఓదార్పు కల్గిస్తుంది. నేటి మానవ సమాజంలో ఓదార్చే వారే లేరు. వేగవంతమైన జీవన విధానంలో ఓదార్పు కావాలి. ఓదార్పు నివ్వాలి. ఓదార్పు వల్ల మనసు తేలిక పడుతుంది అని తెలియజెప్పారు. ఇలా ఈ కవయిత్రి తప్ప మనసుతో ఏ కవి మాట్లాడగలరు?

ప్రకృతిని, జగత్తు అందాన్ని, కుసుమసోయగాన్ని చూపించారు. సాహిత్య రసాస్వాదన మనస్సును అలంకరింపజేస్తుందని మన కవయిత్రి మల్లీశ్వరి గారి మానస కుసుమ సోయగం అక్షర రూపాన్ని దాల్చి ప్రశాంత గజల్ గా ప్రవహించింది. "ఆద" – గజల్ సంపుటి పాఠకుల ఆద రణకు నోచుకుంది. ఇటు వంటి అనేక సంపుటిలు ఇంకా వీరి కలం నుండి జాలువారా లని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ...

–డా. తాడేపల్లి వీరలక్ష్మి,
సెల్:9440064719

భారతీయ తాత్విక దర్శనం గొప్పది–డా॥మామిడి హరికృష్ణ

పుస్తకావిష్కరణలో జస్టిస్ బి. చంద్రకుమార్, డా॥ వీరపనేని విష్ణురావు, ఆచార్య కడారు వీరారెడ్డి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, బైస దేవదాసు, ఆచార్య మసన చెన్నప్ప, ఆవిష్కర్త డా॥మామిడి హరికృష్ణ, డా॥జి. నరసింహశర్మ, పెండ్యాల నరసింహశర్మ, డా॥ బేబి రమణి తదితరులు.

హైదరాబాద్, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): **'నేను ఎవరు?'** అనే ప్రశ్నతో అద్వైతము, ద్వైతము తాత్విక అన్వేషణలో దైవం. ప్రకృతి శక్తిని మనిషి కనుగొన్నాడని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా॥మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. భారతీయ తాత్విక దర్శనం గొప్పదని ఆయన అన్నారు. మసన చెన్నప్ప ఈ తాత్విక తను తన రచనల్లో చూపారని ప్రశంసించారు. అంతర్గత, బహిర్గత ప్రపంచం, దానికి అతీతమైన ప్రపంచాన్ని తెలుసుకోవడమే వికాసమని ఆయన అన్నారు. ఆచార్య మసన చెన్నప్ప పుస్తకాల ఆవిష్కరణ సభకు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్టు బైస దేవదాసు మాట్లాడుతూ.. తన షష్టిపూర్తి, పదవి విరమణ అనంతరం తన జీవిత భాగస్వామి శ్రీమతి ప్రమీలగారికి గుండె పోటు రావడంతో ఒంటరి వాడయ్యాడని, గుండె నిబ్బరంతో సాహిత్య కృషి చేస్తు ఆధ్యాత్మిక రంగంలో రచనలు చేస్తు ప్రవచనాలు చేస్తు ప్రమీలగారి జ్ఞాపకలతో జీవిస్తున్న మనసున్న మనిషి ఆచార్య మసన చెన్నప్ప గారని కొనియాడారు. అంతే కాకుండా **'ప్రమీల శక్తి పీఠం'** ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ప్రతిభ గల వ్యక్తికి **విశిష్ట సాహితీ పురస్కారం** ప్రదానం చేయడం గొప్ప విషయమని అన్నారు. శ్వాస అంశంపై దాని ప్రాధాన్యత, మానవ జీవితానికి దానికి గల అనుబంధాన్ని తాత్విక తను డా॥ వీరపనేని విష్ణురావు వివరించారు. తనకు సాహిత్యమంటే ఇష్టమన్నారు. తెలుగు భాషాభిమానం, సాహిత్యం తనకు ఇష్టమన్నారు.

తెలంగాణ బిసి కమీషన్ చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ ఇష్టపడి ఎంతో కష్టపడి చదువు పూర్తి చేసుకుని సాహిత్యంలో పేరు గడిస్తున్న మసన చెన్నప్పను అభినం దించారు. తనతో చిన్ననాటి జ్ఞాపకాలను వివరించారు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నావొజు బాలచారి మాట్లాడుతు.. సామాజికాంశాలతో పాటు ఆధ్యాత్మిక రచనలు చేస్తున్న చెన్నప్పను అభినందించారు. అనంతరం చెన్నప్పను సత్కరించారు.

జస్టిస్ బి. చంద్రకుమార్ మాట్లాడుతు జీవన విధానం గురించి ప్రతి వ్యక్తి ఆలోచించాలని మనం పది మందికి చేయూత నందించగల స్థాయిని పెంచుకో వాలన్నారు. ఎన్నో మంచి విషయాలను తన ఆధ్యాత్మిక రచనల ద్వారా అంది స్తున్న చెన్నప్పను కొనియాడారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతు ఆచార్య మసన చెన్నప్ప గొప్ప ఆధ్యాత్మికవేత్త అని మన భారతీయ దర్శనాలపై పట్టు ఉన్న గొప్ప సాహితీ వేత్త అని కొనియాడారు. ఆధ్యాత్మికవేత్త, కవి ఆచార్య మసన చెన్నప్ప 70వ పుట్టినరోజును పురస్కరించుకుని 7 సాహిత్య పుస్తకాల ఆవిష్కరణ సభను రవీంద్రభారతి లో నిర్వహించారు.

70వ వసంతంలో 60 పుస్తకాల రచయితగా ఆచార్యుడు కీర్తింపబడటం విశేషం అని పలువురు వక్తలు కొనియాడారు. ఆచార్య మసన చెన్నప్ప రాసిన నాల్గు పుస్తకాలైన **'సంపూర్ణ యోగ దర్శనం'** డా॥ మామిడి హరికృష్ణ, **'అనుభవ మంజూష'** బైస దేవదాసు, 'సరో జన' జస్టిస్ బి.చంద్ర కుమార్, **'ఈశ్వరస్తుతి ధ్యాన మంత్రం'** ఆచార్య కసిరెడి వెంక టరెడ్డి ఆవిష్కరించారు. ధూళిపాళ అరుణ రచించిన **'మసన చెన్నప్ప సమగ్ర సాహిత్యం'** పుస్తకాన్ని ఆచార్య కడారు వీరారెడ్డి, డా॥జి. నరసింహ శర్మ రచించిన **''మసన చెన్నప్ప శతకం''** డా॥ వీరపనేని విష్ణురావు, పెండ్యాల కిషన్ శర్మ రచించిన **"ముక్తాహారం** పుస్తకాన్ని సి.యస్. రామకృష్ణ గుప్త ఆవిష్కరించారు. తన **'అనుభవ మంజూష'** పుస్తకాన్ని సత్యయ్య యాదమ్మ దంపతులకు ఆచార్య మసన చెన్నప్ప అంకితం ఇచ్చారు.

'ప్రమీలా శక్తిపీఠం విశిష్ట సాహితీ పురస్కారం'ను డాక్టర్ బేబి రమణికి ప్రదానం చేశారు. పీఎస్ రాచర్ల రామకృష్ణ గుప్త– శ్రీదేవి, డా॥ బేబి రమణి దంపతులు డా॥ మసన చెన్నప్ప సాహిత్య పుస్తకాల ముద్రణకు తమ సౌహార్దతను అందివ్వడంపై డా॥ మసన చెన్నప్ప కృతజ్ఞతలు తెలిపారు.

ఆచార్య మసన చెన్నప్పను సత్కరిస్తున్న బైస దేవదాసు, డా॥నామోజు బాలాచారి, డా॥ భీంపల్లి శ్రీకాంత్, వనజ తదితరులు

డా॥ బేబి రమణికి 'ప్రమీలా శక్తిపీఠం విశిష్ట సాహితీ పురస్కారం' ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథి డా॥ మామిడి హరికృష్ణ, జస్టిస్ బి.చంద్రకుమార్, ఆచార్య మసన చెన్నప్ప తదితరులు.

డా॥ మామిడి హరికృష్ణను సత్కరిస్తున్న అతిథులు.

కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ ఉద్యమ ప్రస్థానం', 'విప్లవాల విప్లవం' గేయ సంపుటి ఆవిష్కరణలో డా॥అయినంపూడి శ్రీలక్ష్మి, కందిమళ్ళ ప్రతాప్‌రెడ్డి, డా॥కె. శ్రీనివాస్, నిఖిలేశ్వర్, ప్రొ॥ హరగోపాల్, ప్రొ॥ఎస్వీ సత్యనారాయణ. ● సభకు విచ్చేసిన ప్రముఖులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): "భారత స్వాతంత్రోద్యమంలోనూ, చారిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనూ తెలుగు నాట తలెత్తిన సకల సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక ఉద్యమాలలోనూ, నిర్ణయాత్మక పాత్రను నిర్వహించిన మహోద్యమం భారత కమ్యూనిస్టు ఉద్యమం" అని పలువురు కమ్యూనిస్టు నాయకులు, ప్రముఖులు అన్నారు. 'మట్టి మనుషులను మహా నాయకులుగా, సామాన్యులను మాన్యులైన ఉద్యమకారులుగా, ప్రతి ఆద్యము ఎగుడు దిగుడులను ఒడిదుడుకులను ఎదుర్కొంటూ పీడిత ప్రజల పక్షాన నిర్విరామంగా పోరాడుతూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానం స్ఫూర్తిదాయకం' అని వక్తలు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ కమ్యూనిస్ట్ నాయకులూ కందిమళ్ళ ప్రతాపరెడ్డి రచించిన రెండు గ్రంథాల ఆవిష్కరణ సభ ప్రముఖ విప్లవకవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్ అధ్యక్షతన హైదరాబాద్ లో శనివారం జరిగింది. **'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ ఉద్యమ ప్రస్థానం'** గ్రంథాన్ని మానవ హక్కుల నాయకులు ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆవిష్కరించారు. **'విప్లవాల విప్లవం'** గేయ సంపుటిని సుప్రసిద్ధ సాహిత్య పరిశోధకులు, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి అతిథులు గా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కలవేణ శంకర్, ప్రముఖ కవి విమర్శకులు ఏటుకూరి ప్రసాద్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు నరహరి, మాజీ ఎం.ఎల్.ఎ.మానం ఆంజనేయులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ మతోన్మాద ఫాసిజం, సామ్రాజ్యవాద ప్రపంచ సంక్లిష్ట సామాజిక నేపథ్యంలో నేటి తరానికి ప్రజాస్వామిక విలువలు, లౌకిక సంప్రదాయం ఆవశ్యకతను తెలియజేయాలని అభిప్రాయపడ్డారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఉద్యమాలలో పాటలు నిర్వహించే పాత్రను వివరించిన ప్రతాపరెడ్డిని అభినందించారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ నిర్వహించిన సభ ప్రారంభంలో ప్రజా నాట్యమండలి గాయకుడు పల్లె నరసింహ గానం చేసిన ప్రతాపరెడ్డి గారి పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. తొలుత నిఖిలేశ్వర్ అధ్యక్షపన్యాసం చేస్తూ తొంబై ఏళ్లు పూర్తి చేసుకున్న కందిమళ్ల ప్రతాపరెడ్డి సాహిత్య కృషిని వక్తలు అభిన ందించారు. కార్యక్రమంలో ఐసంపూడి శ్రీలక్ష్మితో పాటు, ఎ.పి. సిపిఐ కార్యదర్శి కె. రామకృష్ణ, ఐ.పి.ఎస్. అధికారి ఎం.బి.వెంకటేశ్వరరావు, సిపియం నాయకులు వీరయ్య, మోత్కూరి నరహరి, ప్రముఖ సాహితీవేత్తలు ఏటుకూరి ప్రసాద్, హెచ్చార్కె, డా॥ నాళేశ్వరం శంకరం, శ్రీమతి భారతి, ఎస్. జయతో పాటు పలువురు ప్రము ఖులు, రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు, సాహితీవేత్తలు, కళాకారులు పలువురు పాల్గొన్నారు.

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన

దిల్ ఔర్ జిందగీ

-ఎం.ఎస్.బేగం

2001లో రాసిన కథ

దిల్‌కి ఆర్‌మా ఆఁసుహోఁయె బహోగయే
హమ్ వఫాకర్‌కే భీ తన్‌హాఁరహేగయే..

ఈ పాట రోజుకి ఎన్నిసార్లు వింటానో నాకే తెలియదు. ఈ పాటకి నా జీవితానికి ఏదో సంబంధమున్నట్లనిపిస్తుంది. అవును, నేను కూడా ఒక ముస్లిం-స్త్రీనే కదా, పైగా ఒక బిడ్డకు తల్లిని!

ఊహ వచ్చిన దగ్గర్నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి సంఘటన నా కిష్టం లేనివే అయినా, ఇష్టం లేనివిధంగానే జరిగినా.. నా కిష్టమైనని, నా భావాలు, ఆశలు, ఆశయాలు నాలోనే అణగదొక్కుకొని నడుస్తున్న నా జీవితానికి రాజీ పడటం అలవాటైపోతున్న దాన్ని, ఇక నాలో ఓపిక నశిస్తూ జీవితం మీదే విరక్తి వచ్చేస్తున్నా, ఒకేసారి చావలేక రోజూ చస్తూ బతుకుతున్నదాన్ని.

ఇన్నాళ్ళు నా జీవితం అడవి కాచిన వెన్నెల అయినా అనుకోకుండా, స్టేట్స్‌లో ఉన్న నా భర్త నన్ను తీసుకెళ్లానన్న వార్త నన్ను అయోమయంలోకి పడేసింది. గమ్య మేమిటో తెలియని నా జీవితానికి వెలుగు వస్తుందనుకొంటూ నా కన్న అమ్మీ అబ్బాల కళ్ళలో సంతోషాన్ని చూసి గడిచిన నా వంటది జీవితమంతా మర్చిపోయాను.

రాబోయే కొత్త జీవితపు కలలు ఒక వైపు సంతోషాన్నిస్తున్నా, మరోవైపు ఏ మూలో నన్ను భయ పెడ్తూనే ఉన్నాయి.

ఆయన రోజూ ఫోన్ చేస్తున్నారు. పాస్‌పోర్టు ఆఫీసుల చుట్టూ తిరగగా తిరగగా ఎట్టకేలకు పాస్‌పోర్టులు వచ్చాయి- పాపకి, నాకు.

ఎనిమిది సంవత్సరాల తర్వాత భర్త దగ్గరకి చేరడం..! గుబులుగా ఉంది నాకు. ఏడు సంవత్సరాల కూతురు.. ఎలా ఉండగలుగుతుందో ఉండలేదో అర్థంకాని అయోమయం.

ఆయన పాపకి నాకు ఫ్లయిట్ టికెట్స్ పంపించాను. వెళ్ళేరోజు రానే వచ్చింది. దాడీ అంటే ఎవరో తెలియని పాప... ఇన్నాళ్ళు అమ్మమ్మ, తాతయ్యల వళ్ళోనే పెరిగింది. వాళ్ళనీ విడిచి రాలేక ఒకటే ఏడ్పు.. ఎయిర్‌పోర్ట్‌లో ఏడ్చి ఏడ్చి సొమ్మసిలిపోయింది. దానికి వెళ్ళక తప్పదన్న విషయం ఎలా సమ్‌జయించాలో అర్థం కాక ఎన్ని తిప్పలు పడుతూ వచ్చానో నేను...

ఫ్లయిట్ ఎక్కించడానికి వచ్చిన అమ్మీ అబ్బా, భాయ్, బహన్- వీళ్ళందరినీ వదుల్తూ లోపలి కెళ్తుంటే నా గుండె బరువెక్కుతూ అడుగులు కదలడమే భారమైంది. పళ్ళ బిగువున ఏడ్పును ఆపేస్తూ భయంభయంగా ఫ్లయిట్ ఎక్కి ఏడుస్తున్న పాపను సమ్‌జాయించే వంకతో బోరున ఏడ్చాను.

రాత్రి బయలుదేరిన ఫ్లయిట్ ఉదయం ఏడుగంటలకి సింగపూర్‌లో లాండింగ్ అయింది. మళ్ళీ ఫ్లయిట్ సాయంత్రం, అప్పటి వరకు పాప, నేను ఎలా గడిపామో మాటల్లో చెప్పలేం. నాకు ఇంగ్లీషు రాదు, ఎవరూ మాట్లాడేవాళ్ళు లేరు. ఆకలి అంటే ఏంటో కూడా గుర్తుకు రావట్లేదు. భయం భయంగా బిక్కు బిక్కుమంటూ పాప, నేను ఒంటరిగా కూర్చున్నాం...

సాయంత్రం ఫ్లయిట్ బయలు దేరింది. శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళేసరికి

> నా కిష్టమైనని, నా భావాలు, ఆశలు, ఆశయాలు నాలోనే అణగదొక్కుకొని నడుస్తున్న నా జీవితానికి రాజీ పడటం అలవాటైపోతున్న దాన్ని, ఇక నాలో ఓపిక నశిస్తూ జీవితం మీదే విరక్తి వచ్చేస్తున్నా, ఒకేసారి చావలేక రోజూ చస్తూ బతుకుతున్నదాన్ని.

మళ్ళీ సాయంత్రం, ఏడున్నర అయింది. దిగి లాంజ్‌లో లేగజ్ తీసుకొని బయటికొచ్చాం. ఒక గంట గడిచింది. ఆయన రాలేదు. మరో అరగంట అయింది. చాలాసేపట్నుంచి ఒంటరిగా నిలబడి ఉన్న మమ్మల్ని చూసి, నేను చీరలో ఉండటం గమనించి ఒక ఇండియన్స్ జంట మా దగ్గరికొచ్చి పలకరించారు. వారికి కొంచెం హిందీ వచ్చు. అతను మావారి సెల్‌కి ఫోన్ చేశారు. నో రిప్లయ్, అడ్రస్ ఉంది కదమ్మా, టాక్సీ మాట్లాడి పంపిస్తానంటాడు. అతను కాని నాకు భయంవేసింది. 'లేదండి ఆయన వస్తారు' అన్నాను. తర్వాత వాళ్లు వెళ్ళిపోయారు. చూసిచూసి నా కళ్ళు నొస్తున్నాయి. మొహం పీక్కుపోయింది. పది కావొస్తుంది. అప్పుడు వచ్చారు. మీరు ఇక్కడెందుకు వచ్చి ఉన్నారు. నేను లోపల వెతుకుతున్నా నన్నారు. మేము ఏమీ మాట్లాడలేదు.

కారులో లగేజి తనే సర్దేశాడు. మేము కూర్చున్నాము. కారు వేగంగా పరుగెత్తుతుంది. నా గుండె అంతకన్నా వేగంగా కొట్టుకుంటుంది. ఇంటికెళ్ళగానే ముందు అమ్మావాళ్ళకి ఫోన్ చేశాను. క్షేమంగానే చేరుకున్నానని, వాళ్ళు నేను ఏడుగంటలకి శాన్‌ఫ్రాన్సిస్కో చేరి ఫోన్ చేస్తానని ఎదురు చూస్తూ.. నా ఫోన్ రాకపోయేసరికి మా అమ్మీ అబ్బా, చెల్లి మూడు గంటలపాటు చాలా కంగారు పడిపోయినట్లు చెప్పారు. మా అమ్మీ అబ్బా ఇక ఏడుస్తూనే ఉన్నారని చెల్లి చెప్పింది. నా ఫోన్‌తో వాళ్ళ గుండె బరువు దిగిపోయింది.

మరునటి రోజునుండి నా కొత్తజీవితం మొదలు ఒక పదిరోజులు హాస్పిటల్స్ చుట్టూ తిప్పాడు. మెడికల్ చెకప్స్ అంటూ, మా ఆరోగ్యం కోసం అనుకున్నా కాదు తన గ్రీన్ కార్డు అప్లయ్ కోసం తర్వాత టాక్స్ ఫైల్ చెయ్యడం కోసం ఆఫీసుల చుట్టూ తిప్పాడు. దాని వల్ల తనకే టాక్స్ డబ్బులు ఇరిగి వచ్చాయి.

రోజూ ఏవేవో మాటలు అంటూ నన్ను వేధించాలని చూసేవాడు. నేను పట్టించుకోవడం మానేశాను. పాప తండ్రిని చూస్తేనే దూరంగా వెళ్ళేది. నా దగ్గరికి పరిగెత్తుకువచ్చేది. దానికి బొమ్మలు, బట్టలు కొనిస్తూ దగ్గర తీసుకోవాలని చూసేవాడు. నేను కూడా తనకి దగ్గరవ్వాలని తప్పించుకుని తిరిగేదాన్ని. కారులో తిరిగిరమ్మని పంపించేదాన్ని. ఇప్పుడు కొంచెం చనువేర్పడింది. మొదట్లో నాకీ అమెరికా నచ్చలేదు. నేను ఉండను ఇండియా వెళ్ళిపోతాను, నేను నానీ, నానా దగ్గరకు వెళ్లిపోతాను, నన్ను పంపించెయ్యండి అంటూ బాగా

> అప్పుడు భర్త వదిలేసిన భార్యగా పుట్టింట్లో ఉన్నాను. లోకం అనే సూటిపోటి మాటలను భరిస్తూ ఉన్నాను.

ఏడుస్తూ, గోల గోల చేసేది. నాకు చాలా భయమేసేది. ఇప్పుడిప్పుడు కొంచెం అలవాటవుతున్నది.

వారం వారం అమ్మావాళ్ళకి ఫోన్ చేస్తూ ఉంటాను. అమ్మ అడుగుతూ ఉంటుంది. మీరిద్దరు బావుంటున్నారా అని బానే ఉంటున్నామని చెప్తున్నాను. ఆ మాట నా హృదయం నుంచి కాక గొంతులో నుండి మాత్రమే వస్తుంది.

అవును మేమిద్దరం బావుంటున్నామా...? బావుండట మంటు అర్థం రోజూ కారులో తిప్పడం, బట్టలు కొనివ్వడం ఇదేనా అనిపిస్తుంది.

నా జీవితం అంతఃపురంలో రాణివాసమే. అన్ని సౌకర్యాలు ఉన్న ఇల్లు, బయట కెళ్ళాల్సిన అవసరం లేదు. తను ఉదయం ఆఫీసు కెళతాడు. వచ్చే సరికి అందంగా అలంకరిం చుకొని ఉండటం.. రోటీన్ జీవితం.

నా గత ఎనిమిదేళ్ళ జీవితానికి, ఇప్పటికి తేడా ఏమిటి?! ఆలోచిస్తే- అప్పుడు భర్త వదిలేసిన భార్యగా పుట్టింట్లో ఉన్నాను. లోకం అనే సూటిపోటి మాటలను భరిస్తూ ఉన్నాను. అమ్మా నాన్నల మధ్య కూతురుతో హాయిగానే ఉన్నాను.

ఇప్పుడు నా వాళ్ళందరికి దూరమైపోయినా లోకం దృష్టిలో మాత్రం నేనొక అదృష్టవంతురాల్ని. ఇంతలోనే ఎంత మార్పు.. లోకం డబ్బుని మాత్రమే చూస్తుంద నిపిస్తుంది.

అటువైపు వాళ్ళు ఇటువైపు వాళ్ళు ఒక మనవడు కావాలని అడుగుతున్నప్పుడల్లా గుండెలో ఏదో బాధ ఒకవైపు, మరోవైపు నవ్వు వస్తాయి. ఒకప్పుడు, ఏడేళ్ళక్రితం నెలరోజు కాపురానికి నెల తప్పి.. 9 నెలలు మోసి భయంకరమైన ప్రసవ వేదన అనుభవించి.. పెద్ద ఆపరేషన్ తో బిడ్డను కని.. దాన్ని పెంచుతూ.. దాని భవిష్యత్తు కోసమే బతుకుతూ .. ఇప్పుడు దాని భవిష్యత్తు బాగుపడుతుందనే...జీవితానికి రాజీ పడిపోయాను.

మా అపార్టుమెంట్‌లో ఆడాళ్ళందరూ నేను చాలా అందంగా ఉంటానని అనుకుంటారట. నాకు నవ్వొస్తుంటుంది. మా వారేమో మగవాడ్ననే అధికారాన్ని చూపెట్టడా నికి గతాన్ని తవ్వుతూ వేధిస్తుంటారు. ఏదో ఒక వంకతో నా వాళ్ళందర్నీ తిడుతూ ఉంటాడు. ఆఖరికి ఒకసారి నాపై చెయ్యి చేసుకున్నాడు.

ఆలోచిస్తుంటాను.

ఎనిమిది సంవత్సరాలు ఆవిరైన నా కాలానికి ఆకులు ఆకులుగా.. కాలం కాకపోయినా రాలిపోయిన నా కోరికలకి.. ఎవరు విలువ కడతా రు...?

నా కూతురు తల్లీ తండ్రీ మధ్యలో ఉయ్యాలలూగే ఏ చిన్నారిని చూసినా అసంతృప్తిగా ఒక వేపుకి తల తిప్పు కుని కన్నీళ్ళయినా చిన్నారి మనసుకి.. ఎవరు, ఎవరు జోల పాడేది?

అసలు అలాంటి ఒక ఒంటరి జోలపాట ఈ ప్రపంచంలో ఏ రచయితయినా రాయగలడా?

నా జీవితం ఇక అంతే, ఇలాగే నడవని. నా పాప కోసం దాని భవిష్యత్తు కోసం ఇలాగే బతికేస్తాను అని మనసుకు సర్ది చెప్పుకుంటు న్నాను. కాని ఒక్కసారి అనిపిస్తుంది. లోకం ఏమనుకుంటుందోనని.. తల్లిదండ్రుల కోసమని..వాళ్ళ గౌరవ మర్యాదలకోసమని.. ముఖ్యంగా తమ పిల్లల భవిష్యత్తు కోసమని.. ఎన్ని జీవితాలు నాలాగా బలైపోతు న్నాయో.. తమ ఇష్టాలు, తమ భావా లు, ఆశలు, ఆశయాలు అణగదొక్కుకుని పిల్లల కోసం.. తల్లిదండ్రుల కోసం.. లోకం కోసం.. ఇలా రాజీ పడిపోవడం, సరైనదేనా..?!

("వతన్ ముస్లిం కథలు")

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)

అద్వితీయం -జీవన పోరాట పాటల మేర మల్లేశం

పునః సమీక్ష



ప్రతులకు: కొత్తకొండ కరుణాకర్ రావు ఫోన్: 8074567285
వెల: రూ150/-

ఉద్యమ సమయాలలో.. సమస్యల వలయంలో... పోరాట పోరుబాటలో పాట పాత్ర ఎంతో ప్రధానమైనది. సామాన్యులను సైతం అసామాన్యులను చేయడమే కాకుండా సమాజంలో జరుగుతున్న అరాచకాలను, అన్యాయాలను, ఆవేదనలను తెలియజేసి వారిని జాగృతపడటానికి మాటలు సరిపోవు. కానీ పాటలు అత్యున్నత స్థానాన్ని అలరిస్తాయి. అందరికీ ఆకళింపు కలిగేలా చేస్తాయి. అలాంటిది కామ్రేడ్స్ అంటే మాటలా? వారి మాటల పదును, వ్యంగ్యం గురించి మనం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మేర మల్లేశం కామ్రేడ్ స్వాతంత్ర సమరయోధుడు. కవి, రచయిత, వక్త. ప్రశ్నించే తత్త్వం, అన్యాయం జరిగే చోట తిరుగుబాటు చేసే తత్త్వం కలిగివున్న వీరు వృత్తి రీత్యా ఉపాధ్యాయులు. 1987 సంవత్సరం నాటికే స్వాతంత్ర సమర యోధునిగా, విప్లవ కమ్యూనిష్టుగా ఆ ప్రాంత ప్రజలకు ఎంతో తెలిసివున్న మనిషి. కానీ వీరికి ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడే పాట అల్లి గొంతు ఎత్తేవాడు. ఉభయ కమ్యూనిష్టులు వ్యతిరేకించిన 1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని సమర్థించి పాటలు రాసారు. వీరు రచించిన అనేక పాటలు వూరూరా తన అనుచరులు కూడా పాడేవారు. "సివిల్ హాస్పిటల చరితమును తెలిపెదమమ్మా" అనే పాట చాలా మంది పాడేవారు. వీరు నైజాం వ్యతిరేకపోరాటంలోనూ, ఆ తర్వాత రాసిన అనేక పాటలు ఎంతో ప్రాచుర్యంలో ఉన్నాయి. ఆ పాటలన్నీ ఒక పుస్తకంగా తీసుకురావాలనే ఆకాంక్ష మల్లేశం వారికి వుంది. కొన్ని అనివార్య కారణాల వల్ల కొన్ని పాటలు దొరకక పోయినా 1997, జూలైలో 'మేర మల్లేశం పోరాట పాటలు" మోయ తుమ్మెద ట్రస్టు ద్వారా అన్నవరం దేవేందర్ గారు ప్రచురించారు. కాకుంటే ఆ పుస్తకం ప్రచురణ ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలోనే వీరు కాలం చేయడం దురదృష్టకరం. దాంతో వీరి దశదిన సంస్మరణ సభ ఏర్పాటు చేసి ఆగస్టు 28, 1997 సంవత్సరంలో అంతకపేటలోనే ఆవిష్కరణ చేసారు.

కొంతకాలానికి పోరాట యోధుల జీవిత చరిత్రలను సేకరించే క్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయంలో పనిచేసిన అధ్యాపకులు డాక్టర్ కొట్టూరు ముత్యం సంపాదకత్వంలో మల్లేశం గారి ఆత్మకథను మరియు పాటలను కలిపి పుస్తకంగా రూపొందించారు. ఆ విషయంలో వీరి కృషి ఎంతో అభినందనీయం. ఒక కవి అయినా, రచయిత అయినా ఎవరికైనా వారు రచించే విషయాలను సమాజంలో గుర్తింపు పొందాలనుకోవడం పరిపాటి. కొందరివి వారి ప్రమేయం లేకుండానే ప్రాచుర్యంలోకి వస్తాయి. కొన్ని ప్రాచుర్యం కలిగేటటువంటి సత్తువ వున్నా ఏమీ నోచుకోకుండా వెనకబడిపోతాయి. ఆ విషయంలో తెలంగాణ వారిని మనస్ఫూర్తిగా మెచ్చుకోవాలి. ప్రతిభ వుంటే చాలు ఎవరినైనా గుర్తుంచుకునే తత్త్వం ఈ ప్రాంతవాసులకు వుంది. అక్కడ అధికారం, అంతస్తు ప్రాంతం, వర్గం లాంటివేవీ ఏమాత్రం పట్టించుకోరు. అందుకు ఇలా వెలికి వచ్చిన మహానుభావులు, కారణజన్ములు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. తెలంగాణా ప్రభుత్వం కూడా ఇలాంటి వారి జీవితాలను, వారు రచించిన రచనలను ఎన్నో వెలికి తీసిన సందర్భాలు అనేకం వున్నాయి...

"మళ్ళీ యుద్ధమే వస్తే హంతకులు - అంటూ మిగలరోయి/హిట్లరు వారసులారా/మీకు/ మా జనమెచ్చరికోయి?/మూలమూల భూగోళ మంతటా -జ్వాల రగులునోయి/ అంతులేని జనమంతా కదిలితే -సరిహద్దులుండవోయి " అంటూ మా జనం హెచ్చరిక వినిపిస్తారు

మరోచోట **"పెనుగొండ రాక్షసుడ వినరా/ కోదండ రాంరెడ్డి నినుద్రుంచెదరా/ ఔరంగాబాద్ జిల్లా జల్సా జైలులో/ నీవు పెట్టిన హింసమేమెట్లు మరుతుము"** అంటూ ఖైదీలను హింసించారని కోదండ రామరెడ్డిని నిలదీస్తారు. పేర్లతో సహా చెబుతూ, వారు చేస్తున్న అమానుష కాండల్ని వివరిస్తూ రాయాలంటే ధైర్యం వుండాలి. అంతటి ధైర్యవంతులు మేర మల్లేశం.

"రేణువులై లేచారోయ్ రేణికుంట రైతులు" అనే పేరుతో రైతుల్ని తట్టి నిద్రలేపే తీరులో వుంది.

ముఖ్యంగా గాంధీయిజమంటే అనే పాటలో **"రార కూలన్నా కూర్చోవిను పాలేరన్నా/ నంగతెరగి ముందుకు సాగిరా కూలన్నా/ చెప్పుతు చేతికర్ర గొంగడి లేకుంటావు/ పంట చేండ్లే ప్రపంచమంటు చెప్పుకుంటావు"** అనే పాట ఎంతో అర్థవంతంగా వుంది. చివరిలో **"ఏనాటి నిర్దయమో యెవరి చేతికొలత యిదోశ్రీ తూమెడే జీతమనే గీతమలగదేమన్నా/ చిన్న కుంచెము నీది చెల్లు కుంచెము కాదే/ ఆ చిన్న కుంచమైనా సీగనింపరే మన్నా"**_అనే వాక్యాలు చదువుతుంటే కంట నీరు వస్తుంది.

ఇలా ఒక్కటేమిటి? ఈశ్వర అల్లా తేరే నామనే ఇంద్రజాలం, అహంకారం, వీర తెలంగాణ నీకు తగదు సలాం,ఆంధ్రా తెలంగాణా ఒప్పంద నాటకాలు, రక్షకులా? భక్షకులా?, కోలాహలం,అమర్ హై ఖాజా వంటి అనేక పాటలు చదువుతుంటే జీవితం నాకు మరోకోణంలో సాక్షాత్కరించిన మాట నిజం. జీవితం ఎప్పుడూ ఒకే కోణంలో చూసేవారే ఎక్కువ. కానీ కొందరుంటారు. ఇది తప్పు అని చెప్పేవారు, ఇలా వుంటే బావుంటుంది అని చెప్పేవారు, ఎలా ఎందుకు చేస్తున్నారు? అని ప్రశ్నించేవారు, ఇలా ఎందుకు చేయరు? అని నిలదీసేవారు చాలా తక్కువ మంది వుంటారు. వారే మేథో సంపన్నులు. కళల కాణాచి అయిన ఈ తెలంగాణ ఉద్యమాల పోరు గడ్డ. తమ స్వేచ్ఛకోసం, తమ అస్తిత్వం కోసం పోరాడిన కలం వీరులు అనేకం. వీరిలో భయం వుండదు. సమాజానికి వాస్తవం తెలియజేయాలనే తపన తప్ప. అలా చేసిన పోరాటంలో మన పాటల మేర మల్లేశం నిజంగా ధన్యులు. ఈ గ్రంథం తప్పకుండా పాఠశాలలో వుండవలసినది. భావి తరాలకు వారి భవితవ్యాన్ని తీర్చిదిద్దే క్రమంలో వీరు రచించిన ఈ పాటల్లో నిజం నిప్పులా వెలికితీయబడింది. ఇంత గొప్ప కవి మన మధ్య లేకపోవడం బాధాకరం. వారి కలానికి ఎప్పటికీ ఈ సమాజం దాసోహం. ఇంత మంచి సాహిత్యాన్ని వెలికితీసిన సంపాదకులు డా॥ కె. ముత్యం గారికి, ఎంతోకాలంగా వీరితో పరిచయం వుండి, వీరి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని మల్లేశం గారికి ఈ గ్రంథం ద్వారా గుర్తుచేసిన పరిశోధక సంపాదకులు , ప్రఖ్యాత కవివర్యులు అన్నవరం దేవేందర్ గారికి తెలుగు సాహితీ సమాజం తరపున నా కృతజ్ఞతలు.

-శైలజామిత్ర
9290900879

అలుకా
కులుకా
పెదవి విప్పి పలుకవే వయ్యారి చిలుకా
-టివిఎస్ రామకృష్ణ ఆచార్యులు
కెనడా

అలక్ష్యం
నిర్లక్ష్యం
ధీమంతుడు సమస్యలను అధిగమిస్తూ చేరుకుంటాడు... లక్ష్యం
-కాకర్ల చెంచలరావు
ఒంగోలు

నేర్పు
కూర్పు
మంచి మనసు మాటలు ఇచ్చును ఓదార్పు
-శ్రీమతి జీ సందిత
చెన్నయ్

రాసుకోండి
చూసుకోండి
హృదయాన్ని విద్వేషం నుండి విముక్తి చేసుకోండి
-లయన్:కంబాల తిమ్మారెడ్డి
కళ్యాణదుర్గం,అనంతపురం జిల్లా

అలుపు
సొలుపు
ఆడుతూ పాడుతూ కష్టపడినపుడే సాధిస్తాం గెలుపు
-డా ఉషారాణి కోగంటి
హైదరాబాద్

వాదాలు
భేదాలు
ఇంట్లో ఆరోగ్యానికి కీడు కలిగించేవే వాదోపవాదాలు!
-జి యన్ వి సత్యనారాయణ
హైదరాబాద్

రూపిణి
హారిణి
జిల్లేడు ఆకుల ఉపయోగం సర్వరోగ నివారిణి
-రాయవరపు సరస్వతి
చోడవరం,అనకాపల్లి

మననం
హనన
జోలెలో ఓట్లు, పీరమెక్కి హామీల ఖననం.
-వి యస్ శాస్త్రి ఆకెళ్ల
విజయనగరం.

పండించు
వండించు
తప్పు జరుగుతోందని తెలిసినపుడు నిర్మొహమాటంగా ఖండించు
-ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

వేదన
రోదన
అశ్లీల చిత్రాల వేధింపులతో చెప్పలేని ఆవేదన..
-డా.పద్మావతి పి
హైదరాబాద్

వేదము
నాదము
ఆచరణీయమైన సంస్కృతి, సంప్రదాయాలపై చేయరాదు వాదము
-జె.విజయకుమారి
విశాఖపట్నం

కలలో
ఇలలో
నీ వలలో చిక్కుకుని ఊరేగుతున్నా ఊహలలో.
-ఋష్యశృంగు ధిల్లేశ్వరరావు
సారవకోట

ఆట
వేట
యుక్తితో సాగితేనే రవళించు గెలుపు పాట!
-బత్తిన గీతాకుమారి
సత్తుపల్లి

ఆడిస్తుంది
ఊరిస్తుంది
జీవితంలో తీరని కోర్కె ఉంటే ఏడిపిస్తుంది
-రాజేశ్వరి కుప్పిలి
విజయనగరం

చెరగదు
కరగదు
సంతోషాన్ని పంచుకుంటే సంపద ఏమీ తరగదు
-సింగీతం విజయలక్ష్మి
చెన్నై

ప్రాణము
ఆఘ్రాణము
సత్కర్మలకు సంతోషించి పరమాత్ముడే చేయడా పరిత్రాణము?
-డబ్బీరు ప్రభాకర్,
రాయపూర్.

వివరణ
సవరణ
లోపాలను సరిచేస్తే జరిగేది కొత్త అవతరణ
-కామేశ్వరి వాడ్రేవు
హైదరాబాదు

పాపం
శాపం
చేతకానితనం,సులువైన ఆయుధం, పనికిరానిది కోపం....!!
-శ్రీమతి భారతీకృష్ణ
హైదరాబాద్

లోచన
ఆలోచన
మానుకో ఎప్పుడు ఎదుటివాడి గురించిన దురాలోచన !
-పప్పు సుజాతారావు
వైజాగ్

జయీ భవ
విజయీ భవ
ప్రయాగరాజ్ పుణ్యస్నానాలకు పోటెత్తుతున్న భక్తజనులకు దిగ్విజయీభవ!
-విజయకుమారి ముదిగొండ
విజయవాడ,

నియోగులు
వియోగులు
సజ్జనుల సాంగత్యంలో దుర్జనులు సైతం సయోగులు !
-నమ్మి ఉమాపార్వతి నాగ్,
చెరుకువాడ.

భోగము
త్యాగము
వెలుగుల జీవితములో ఆత్మీయులు, ఆప్తులు సగభాగము?
-విశ్వేశ్వరశర్మా
భువనేశ్వరము.ఒడిశా

అడుగు
మడుగు
నేతల మాటలని ఆలకిస్తూ పట్టేరు గొడుగు .
-యామిని కోళ్ళూరు
నెల్లూరు

భుక్తి
ముక్తి
సాగే జీవనం లో గెలుపు కోసం చెయ్ యుక్తి!
-చింత ఉమ , నకిరేకల్

కోపము
కూపము
మనిషిలో హఠాత్తుగా ఆలోచన నశించటమొక శాపము
-డా.పి.వి.రామ కుమార్
హైదరాబాద్

ఆళి
పాళి
ఈలోకానికి వచ్చాం వాహ్యాళి. ఆడుకుంటున్నాం వైకుంఠపాళి?
-డా.రామడుగు వేంకటేశ్వరశర్మ.
హైదరాబాదు.

చావు!
రేవు!
సమవర్తి అనుమతి లేనిదే ప్రాణాలు పోవు!
-లింగాల యుగంధరాచారి
మదనపల్లె

ఎంచకు!
వంచకు!
ప్రకృతిలో కాలుష్యాన్ని పెంచకు! ఆయుష్షును త్రుంచకు!
-సిహెచ్.వి. బృందావన రావు
నెల్లూరు

పెత్తనం
కొంటెతనం
ట్రంపుది మెక్సికోతో చైనాతో వ్యాపారంలో మొండితనం.
-కే. ఎం.కే. మూర్తి
సికింద్రాబాద్

గది
మది
సంద్రంలో కలిసేందుకు పరవళ్ళు తొక్కుతున్న నది
-కట్టెకోల చిన నరసయ్య,
ఖమ్మం

వాదము
నినాదము
నీకున్న సమస్యకు పరిష్కారం చూపించదులే వివాదము
-కాటేగారు పాండురంగ విఠల్
హైదరాబాద్

గొడుగు
విడుగు
ఎంతటి దూరప్రయాణానికైనా ప్రారంభం మొదటి అడుగు (విడుగు= వికసించు)
-నెల్లుట్ల శ్రీనివాసులు,
చెన్నై

పుట్టు
గిట్టు
ఉన్నతంగా ఎదిగాక మరువకు మొదటి మెట్టు.....!!
-ఎల్.హృషికేశ్
6.వ.తరగతి,హైదరాబాద్

"అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో ఫేస్ బుక్ వేదికగా డా. రావి రంగారావు నిరంతరాయంగా నిర్వహిస్తున్న వర్క్ షాప్... వచనకవిత /గేయం / ఐదు పద్యాలు/ ఐదు మినీ కవితలు... ఏదో ఒక ప్రక్రియలో పాల్గొనవచ్చు.ఈ వర్క్ షాప్ లో 32 మంది కవులు కవితలు పంపించారు..వాటి నుండి ఉత్తమ కవితలు ఏడు ఎంచుకొని ం గ్రేడ్ ఇవ్వడం జరిగినది .

మా పల్లె పదుచులు

కోయిలమ్మ పలుకులు,
ఉదయ కిరణాల కులుకులు,
చల్ల చల్లని గాలులు
నులు వెచ్చని వలపులు
చలి దుప్పటి కప్పుకున్న
కూనిరాగాలు
మా పల్లె పడుచులు..
పాండు రంగడి పాశురాలు
గోదాదేవి ప్రేమ పూమాలలు
ముత్యాల వాకిళ్ళు
రంగరంగుల రంగవల్లికలు
సంక్రాంతి గొబ్బెమ్మలు
మా పల్లె పడుచులు...
చలి ఒడిలో
పాటల పల్లకిలో
మాధవుని ఊరేగింపులు
నగర సంకీర్తనలు
అల్లరి ఆటలు
పిల్లన గ్రోవి పాటలు
మా పల్లె పడుచులు...
బంతి,చామంతి,మందార
పచ్చని ప్రకృతి అందాలు
మంచు బిందువులు
పూరేకుల సొగసులు
లేత చిగుర్లతో ముచ్చట్లు,
అచ్చట్లు పలికే
ముగ్ధ మనోహర సుకుమారీలు
మా పల్లె పడుచులు..
కొత్త బెల్లం అరిసెలు
కొత్త కోడలు కులుకులు
బావ మరదళ్ల సరసాలు
చెరుకు తీపి కబుర్లు
సంక్రాంతి సంబరాలు
మా పల్లె పడుచులు...
అంబరం తాకే అచ్చట్లు
అలుపే లేని ముచ్చట్లు
పట్టు పరికిణీ వోణీ అందాలు
ఊరించే సింగారాలు

వేకువ తొలి కిరణాల

స్పర్శ సోకిన ఇళ్లన్నీ
రంగవల్లుల ద్వార ముఖాలతో
నవ్వులు ఆరబోసే
హరిదాసు కీర్తనల హరిలో
రంగ హరి రాగయుక్తాన్ని
సోదర ఆహ్వానం పలుకుతాయి.
విరిసిన దిరిశెన పూవుల్లాంటి
పిల్లలు పట్టుకుచ్చుల బట్టల్లో
పసుపుకొమ్ముల రూపాలతో
నట్టింటి మంచాల మీద
వీధి అరుగు గోడలమీద
పండగ సందడి సడులు అవుతారు.
అమ్మ కట్టెల పొయ్యి దగ్గర
మంటఎగాడిస్తూ..బూరెలు..
పొంగళ్లు వండుతూనే..
కొంచెం కొంచెం నాన్నను రుచిచూడమని
ఓ పొగడ్త కోసం ఎదురు చూస్తుంది.
వచ్చిన బంధు మిత్రులకు
కోరిన వంటలు చేసి
ఎంగిలి గిన్నెలు తోమి
అలసిపోకుండా
అందరికీ ప్రేమ పండగవుతుంది
ఒక్క అమ్మే..
భోగి పళ్ళు నెత్తిన
పోయాడానికి దాచిన
చిల్లర డబ్బుల పిడత పగలగొట్టి
తాను కూడ బెట్టినదంతా
ఇంటికే ఖర్చుచేసే తల్లుల సంబరం
అంబరం అంటుతుంది.
గంగిరెద్దుల మూపురమీద
రంగుటద్దాల చీరను కప్పి
ఇంటిముందర వేప చెట్టుకు
పసుపురాసి..
అందరూ సల్లగా ఉండాలని
మనసులో తడి దాచుకుటుంది.
.పండగంటే అందరం
కూడుకుని
ఒకరినొకరం ఓదార్చుకునే
మేళవింపు..ప్రేమల లోగిలి...

-రత్నాజీ నేలపూరి

ధన్యవాదాలు

భూమిని
సస్యశ్యామలం చేసిన
వరుణ దేవునికి
గాలిపటాల
ధన్యవాదములు.
సంక్రమణం
సూర్యుడు
మకరరాశిలోకి...
గిట్టుబాటు ధర రాని రైతు
అప్పుల ఊబిలోకి...
సంక్రమణం
కాలం
పశువులకు
పండుగ కాలం...
కోడి పుంజులకు
గడ్డు కాలం...
కనుమ
ఇల్లరికం
నోటుకి
అమ్ముడుపోయిన ప్రజలైనా
ఇల్లరికపు అల్లుడైనా
డూ డూ బసవన్నలే!
సమిధలు
మత విద్వేషాలలో
అమాయక ప్రజలే
సమిధలు...
భోగి మంట వెలుగులో
ప్రజా ప్రతినిధులు...

-సంబరాజు రమణి

పెద్ద పండగ

నీ నవ్వులు...
ఇల్లంతా పరుచుకోవటమే పండగ
నీ ఆశలు...
పిల్లలలో కనిపించటమే పండగ
నీ రంగుల ఊహాలు...
రంగవెల్లులై మొలకెత్తడమే పండగ...
రైతన్న శ్రమ...
అన్నపూర్ణగా
దేవుని మూలకు చేరటమే పండగ,
కొత్త బట్టలు...
పెద్దవారిని కూడా
పిల్లలుగా మార్చటమే పండగ,
జేబు ఖాళీ అయినా...
కూలీ డబ్బులన్నీ పట్టుకుని
ఇంటికి చేరటమే పండగ...
ఈ సంస్కృతి

యోగ అందరిదా! కొందరి కోసమా..!

'యోగ 'అనగ కలయిక అని అర్థం 'యుజ్ ' అనే సంస్కృత ధాతువు నుండి వచ్చింది యోగ.

యఏవం వేదాహం బ్రహ్మోస్మీతి స ఇదం సర్వంభవతి

నతిన్యేహ నదేనాశ్చ సభూత్వా ఈశతే ఆత్మా హేయ షాం

(శ్వేతాశ్వతరోపనిషత్తు)

(జీవబ్రహ్మైక్య రాజయోగసారామృతము, పుట:256)

(భావం:మనయందలి జీవాత్మయే పరమాత్మమనియు, ఆ పరబ్రహ్మమే జీవాత్మ యనియు, జీవాత్మ పరబ్రహ్మముల రెండింటికి బేధములేదనియు అంతయు పర బ్రహ్మముచే నిండి ఉన్నదని చెబుతుంది.)

దీనిని ఆధ్యాత్మిక భావంతో ఆలోచించి నప్పుడు జీవాత్మ, పరమాత్మ అని తెలుసుకోవడం అని, దీనినే సాధారణ భావంలో చూస్తే శరీరం, మనస్సు కలయికగా మనం అర్థం చెప్పుకోవచ్చు. ఈ కలయికని మనం ఆసనాలు, ప్రాణయమాలు, ముద్రలు మరియు ధ్యానం అనే ప్రక్రియల ద్వారా సాధించుకోవచ్చు.

ఈ ప్రపంచం ఏమిటి?ఈ సృష్టి ఎందుకు జరిగింది? నేనెవరు? అని బుర్ర బ్రద్దలు కొట్టుకొని ప్రయోజనం లేదు. మానవమేధ వికసించిన నాటి నుండి ప్రతి జిజ్ఞాసువు ఈ ప్రశ్నలు వేసుకుంటూనే ఉన్నాడు. వాటికి సమాధానం దొరకదు. కారణం? అవి మనిషి మానసిక పరిధిలో విచక్షణలో లేనివి. యోగా శక్తి పెరిగిన కొద్దీ భౌతికంగా ఆరాటం తగ్గుతుంది. మానసిక ప్రశాంతిని సాధిస్తే యోగా లో అభివృద్ధి సాధించినట్లే సహజంగా ఎవరు యోగి కారు. దీనికి సాధన అవసరం. యోగాన్ని గురించిన పాండిత్యం యోగం కాదు. సహజంగా ఎవరైనా బుద్ధిమంతుడు, గుణవంతు డు కావచ్చు కాని యోగి మాత్రం కాదు. ఒక మహా పురుషుని అనుగ్రహంతో ఒక్క రోజుల్లో వైరాగ్యం చెంది యోగిగా పరిణమించవచ్చు. వేమన, తులసి దాస్, కభీర్ దాస్ ,అన్నమయ్య అలాంటి యోగులు. యోగ సాధనతో సామాన్యుడు మహిమాన్వితుడు, మహాత్ముడు కావడం పతంజలి యోగ లక్ష్యం. అయితే సాహిత్య వేత్తలంతా తాత్వి కులు కారు, కాలేరు. కానీ తాత్వికులు సాహిత్యవేత్తలు అయి తీరాలి. వేమన పద్యాలు, వీరబ్రహ్మేంద్ర యోగి తత్వాలు కనీసం ప్రజల నోళ్లలో ఉండబట్టే వారి తత్వంను గ్రహించగలు గుతున్నాం. శ్రీ అరవిందయోగి, జిడ్డు కృష్ణమూర్తి సాహిత్యం ద్వారానే తమ తాత్వికతను లోకానికి అందించగలిగలిగారు.

అహింస, ఇంద్రియనిగ్రహం, సత్య వర్తనం సాధకునికి ఉండవలసిన కనీస గుణాలు. అహింసను పాటించడం వలన ద్వేషం, అసూయ, స్వార్థం లేకుండా పోతాయి. శత్రువులనే వారు ఉండరు అలాగే ఎవరిని శత్రువులుగా భావించరు. సత్య వర్తనం వల్ల జీవితంలో ఉత్తమ విలువలు ఏర్పడతాయి. ఉదృతమైన కామ వాంఛలు లేనప్పుడు జీవితం నిర్మలంగా ఉంటుంది. ఇంద్రియ నిగ్రహం సాధ్యపడుతుంది. యోగా అంటే మనల్ని మనం తెలుసుకోవడమే. యోగానికి టెక్నిక్ లేదు ఒక నిర్దిష్టమైన మార్గం లేదు, ఎవరి మార్గం వారు ఏర్పరచుకోవాల్సిందే.

యోగ అంటే మోక్షమా! స్వర్గానికి ప్రవేశము! వివోచనమా! నిర్యాణమా! యోగ అంటే వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించడం. ఈ క్షణంలో జీవించడం. మోక్షం అనే పదానికి సరియైన అర్థం ఏమనగా విడుదల, స్వేచ్ఛ, విముక్తి. విడుదల అంటే అన్ని బంధాల నుండి విడుదల. ఈ బంధంలో బాహ్యబంధం, అంతర బంధం అని రెండు విధములు గలవు. బాహ్య బంధం అనగా నా వస్తువులు, నా ఇల్లు,నా భార్య,నా పుత్రులు, నా శరీరం, నా ధనము, నా భూమి ఇలా ఏవి నా అన్నవి అన్ని తనదిగా భావించడం. ఇది ఏవి తన వెంబడి రావు అయినా ఇవి నావి అనే భ్రమమలోనే ఉంటాడు. అంతర బంధం అనగా మానసిక గుణాలు అవి కామ, క్రోధ,లోభ,మోహ,మద, మాత్సర్య, రంభ, దర్ప, ఈర్ష్య,అసూయ అనే ఈ పది గుణాలు. ఇక్కడ బాహ్యబంధాలను మనం పట్టుకోగలం ఏమైనా చేయగలం కానీ అంతర బంధాలను అలా కావు మొదట అవి ఉండవి అని నమ్మడమే చాలా కష్టం,అయితే వీటిపై సాధన చేసి అవి మన ఆధీనంలోకి తెచ్చుకోవడమే మోక్షం.

మనసోహు యన్మ నీభావే ద్వైతం సైవోపలభ్యతే

యదా యాత్యున్మనీభావ స్తదా తత్పరమం పదం

(జీవబ్రహ్మైక్య రాజయోగసారామృతము, పుట:282)

(భావం: మనస్సు,అజ్ఞానమనెడి చీకటిలో మునిగియున్నందున,జీవాత్మయే పరమాత్మ యంశమని తెలిసికొనలేక, తనకంటేను వేరుగానున్న భార్యపుత్రాదులను, ధనధాన్య పశు గృహ క్షేత్రరామానుదులును, వస్తువాహనాదులును తనవియనియు, శరీరమే తాననియు భ్రమపడు నట్లు యీ మాయా మనస్సు చేయుచున్నది. కావున, ఇట్టి మాయామనస్సును బంధించి,పరబ్రహ్మధ్యాన నిష్ఠయందు నిలుచునట్లుజేసినచో పైన చెప్పిన అంతర,బాహ్య బంధాలు నాశనమై బ్రహ్మ సాక్షాత్కారము సిద్ధించును.)

యోగాలో మోక్షం అంటే సినిమాలో చూపించినట్లు ఒక దేవుడి రూపం మన ముందుకు ప్రత్యక్షమై వరాలు ఇవ్వడం కాదు. యోగాలో ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఉండదు, నిన్ను నీ శక్తిని మూలాలలోకి వెళ్లి తెలుసుకోవడమే యోగం. యోగాలో గురువు పాత్ర అనేది దారి చూపే వరకే, గమ్యం చివరి వరకు చేరడం అనేది సాధకునిపై ఆధారపడుతుంది. అలాగే యోగాన్ని పరిచయం చేయడం మాత్రమే గురువు బాధ్యత దాని పూర్తిగా సాధన ద్వారా తెలుసు కోవడం అనేది శిష్యుని ఆసక్తి మీదనే ఆధారపడి ఉంటుంది. మనం యోగ గురించి ఎన్ని పుస్తకాలు ఎందరి గురువులను మార్చిన ప్రయోజనం దొరకదు అది పూర్తిగా మన సాధన మీదనే ఆధారపడి ఉంటుంది.

జాతిమతము విడిచి చని యోగిగా మేలు

జాతితోనె యున్న నీతులేల?

మతము బట్టి జాతి మానకుంట కొరత

విశ్వదాభిరామ వినురవేమ.

(భావం: యోగి కాదల్చుకున్నవాడు జాతి, మతం, కులం లాంటి ప్రాపంచిక వాసనలను వదులుకోవడం మంచిది. యోగజ్ఞానం దాకా వెళ్లిన వాడి జాతి ఇంకా అతని దగ్గరే ఉంటే ఇతరులకు చెప్పగలిగిన ప్రబోధం మాత్రం ఏముంటుంది? మతాన్ని పట్టుకొని వేలాడుతూ, జాతిని పట్టుకుని పాకులాడుతూ ఉండేవాడు యోగి మాత్రుడవుతాడు. నిజమైన యోగం అతనికందదు అంటున్నాడు వేమన.)

యోగ హిందు మతమా! యోగ అనేది ఒక హిందువుది మాత్రమే కాదు. మొదట యోగా ఒక మతం కాదని గుర్తు పెట్టుకోవాలి. యోగ హిందువు కాదు, ముస్లిం కాదు, క్రిష్టియన్ కాదు... యోగ ఒక శాస్త్రం ఎలా అంటే ఒక గణితం, ఒక శరీర ధర్మశాస్త్రం, ఒక భౌతిక శాస్త్రం, ఒక రసాయన శాస్త్రంలా యోగ ఒక శాస్త్రం. భౌతిక శాస్త్రం క్రిష్టియన్ కాదు. యోగ ఒక శాస్త్రం దాన్ని హిందువులు కనిపెట్టడం కాకతాళీయమే అందుకే యోగ అనేది ఒక్క హిందువులదే కాదు. అది అచ్చంగా మనిషి అంతర్గత చలన సూత్రాలను తెలిపే శాస్త్రం. అందుకే ఒక ముస్లిం యోగి కావచ్చు, క్రిస్టియన్ యోగి కావచ్చు, ఒక జైన, బౌద్ధ అందరూ యోగులు కావచ్చు. కాబట్టి యోగ ఒక శాస్త్రం అలాగే పతంజలి యోగ ప్రపంచంలో గొప్ప వాడు, అరుదైన వాడు. మతాలు చెలామణి అవుతున్న అన్నింటికి నమ్మకాలు కావాలి. ఈ విషయంలో ఏ మతమైన ఒకటే, నమ్మకాలలో తేడాలుండవచ్చు. మహమ్మాదీయులది ఒకర కమైన నమ్మకం ఉంటే,హిందువులకు మరో నమ్మ కం, క్రిస్టియన్ కు ఇంకో నమ్మకం ఉండవచ్చు. నమ్మకాలతో పనిలేదు యోగ ఏ విషయాన్ని నమ్మమని చెప్పదు. యోగ అనుభవాన్ని గురించి చెప్తుంది. ఒక శాస్త్రం ప్రయోగాన్ని గురించి చెప్పినట్లు యోగ అనుభవాన్ని గురించి చెబుతుంది. ప్రయోగము,అనుభవం రెండు ఒకటే అయితే వాటి దిక్కులు వేరు. ప్రయోగం అంటే అది మీ బయట చేసేది. అనుభవం మీలో మీరు చేయగలిగేది. అనుభవం అంతర్గత ప్రయోగం. యోగ అనేది శాస్త్రం కాబట్టి ఇది అన్ని మత విశ్వాసాలను గురించి చర్చిస్తుంది. అది బౌద్ధం, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఏదైనా దీని దృష్టిలో సమానమే.

తత్వము తిరమైన తావుల వెతుకుచు

తాను తత్వమగును తత్వయోగి

తలుపులన్ని యుడుగ తానైపో తత్వంబు

విశ్వదాభిరామ వినురవేమ.

(భావం: ఎక్కడ స్థిరమైన తత్వజ్ఞానం ఉంటుందో ఆయా ప్రదేశాల్లో అన్వేషిస్తాడు. ఆ అన్వేషణలో తానే ఒక తాత్వికుడౌతాడు. ఇలా క్రమంగా బ్రహ్మజ్ఞుడై యోగిస్తాయికి చేరుకుంటాడు. ఇంతకూ తాను తత్వం ఒక్కటి కావాలంటే ఏం చేయాలి? ఏం లేదు కోరికలన్నింటిని నశింప చేసుకోవాలి అంటున్నాడు వేమన. తత్వం=దాని భావం)

యోగ అంటే ఆత్మనా? పరమాత్మనా? మనస్సునా? శరీరమా? దేవుడా? అని చాలామందికి ఇది పెద్ద ప్రశ్నగా ఉన్నా సందేహం. పతంజలి ప్రకారం"యోగ చిత్తవృత్తి నిరోధా " యోగ అంటే మనో వ్యాపారాలను ఆపివేయడం.పతాంజలి చాలా ఖచ్చితంగా మనకు ముందే చెప్పాడు. అయితే యోగ అనేది ఒక శిక్షణ అని అర్థం చేసుకోవాలి. ఇక్కడ శిక్షణ అంటే మీరు మీరుగా ఉండగలగడం, మనమేంటో తెలుసుకోగలగడం, నేర్చుకోగలగడం.అయితే దీనితో పాటు యోగాకు చాలా నిర్వచనాలు ఉన్నాయి. కొందరు యోగా అంటే మనస్సు భగవంతుని(పరమాత్మ, ప్రకృతి, సత్యం)తో ఐక్యమవడం అంటారు. ప్రకృతి అంటే నిత్యం, సత్యం, యదార్థం కాబట్టి మనస్సు (లేదా) ఆత్మ, ప్రకృతితో కలవడానికి యోగ అంటారు. మరికొందరు యోగా అంటే అహాన్ని త్యజించడం అంటారు.ఇక్కడ అహం అంటే మనస్సు, ఆత్మ, నేను, నాది, అనే పదాలకు సమానార్థం. అయితే అహం అంటే తనను తాను గొప్పవాడు అని నిరూపించుకోవడానికి మూర్ఖుడు వేసుకునే ముసుగు అహం.అహంకారం పెద్ద అవరోధం కాబట్టి ఎప్పుడైతే నీవు అహంకారాన్ని విడనాడతావో అప్పుడు నీవు భగవంతుని (సత్యాన్ని, యదార్థాన్ని)చేరగలవు అని యోగ చెబుతుంది.

ముగింపు :

మనం శరీరంలో ఉండే వ్యాధిని తగ్గించుకోవడానికి వైద్యుడిని, ఔషధము ఎట్లా అవసరమో అలాగే, మన మనస్సులో ఉండే ఆశ అనే వ్యాధిని పోగొట్టుకోవడానికి గురువు అనే వైద్యుడిని, యోగా అనే ఔషధమును అత్యావశ్యకము అవుతుంది. అలాగే యోగ అనేది వైద్య విధానం కాదు. అది సమాజంలో మనుషులను సర్దుబాటు చేయదు. అది మనుషుల్ని ప్రకృతిలో మమేకం చేస్తుంది.

-యం. మునేందర్
8106735753

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1383వ రోజు 'కాలింగ్ బెల్' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'కాలింగ్ బెల్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

గతంలోకి...

గతంలోకి లాక్కెళ్లి పోయింది
పాత స్మృతులలో ముంచెత్తింది.
తనపైనే దృష్టి పెట్టాలని
తన అవసరాలేమిటో గుర్తించాలని
తనతోనే మాట్లాడాలని
మా తాత చేసే నాటకాలు గుర్తొచ్చాయి
రాని దగ్గను
బలవంతాన తెచ్చుకొని
తనవైపు తిప్పుకునే
కాలింగ్ బెల్లది.
కొత్తగా పెళ్లైన బాబాయి
అందరి మధ్యనున్న పిన్నిని
పక్కకు తప్పించే
స్వరధ్వనులూ కాలింగ్ బెల్లులే!.
మట్టిలో ఆడుతున్నప్పుడు
నాన్నను చూసి
అన్నయ్య చేసే సైగలూ
కాలింగ్ బెల్లే!.
చెల్లి
నాఆటవస్తువులతో ఆడుతూ
నాకివ్వకుంటే.
అమ్మ వినేట్టు
ఏడుపు నటించిందీ
కాలింగ్ బెల్లే.
పరీక్షల్లో జవాబుకై
పక్కవాడికి సైగ చేయడం కూడా
కాలింగ్ బెల్లే.
గుళ్ళో దేవుడికి
దండం పెడుతూ
పరీక్షల్లో పాస్ కావాలని
గంట మోగించడం కూడా
కాలింగ్ బెల్లే
ఎన్నో
ఎన్నెన్నో
కొత్త రకాల కాలింగ్ బెల్లులు.
అన్నీ గుర్తుచేసుకుంటూ
తాదాత్మ్యం చెందుతుంటే
మాఇంటి కాలింగ్ బెల్లు
ఎవరో వచ్చారని
ఒకే తీరుగా మోగుతోంది!.

-గుర్రాల వేంకటేశ్వర్లు

ట్రింగ్ ట్రింగ్

"ట్రింగ్ ట్రింగ్..కుకూ!"
రకరకాల కూతలు శబ్దాలు విన్పడగానే
పంటింటి గృహిణి
పాలపాకెట్ కై ఉరుకు!
మళ్లీ సన్నాయిపాటకి
గృహస్థు పేపర్ కోసం పరుగు
గద్దానికి సబ్బు పట్టించి
చేతిలో షేవింగ్ రేజర్ తో!.
పిట్ట కూతల కోసం
అపార్ట్మెంట్ బుడతలు
పడేపడే హార్మనీమెట్లలాగా నొక్కు.
రామాయణకాలంలో
శునకం మోగించిన ధర్మ గంట
తొలికాలింగ్ బెల్
ధర్మాత్మ రాజులు
గంటల మోతతో
బైటకి వచ్చిన రోజులు
కోటగుమ్మానికి వేలాడే
నేటి కాలింగ్ బెల్
జోసెఫ్ హెన్రీ కనుగొన్న
ఎలక్ట్రిక్ వైర్ తో తొలికాలింగ్ బెల్.
టెలిఫోన్ టెక్నాలజీతో
స్మార్ట్ డోర్ బెల్స్ ప్రస్తుతం
ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీకి
లాడ్జీలో
మీట నొక్కితే
మనిషి హాజరు.
బడిలో
ప్రధానాధ్యాపకుల కాలింగ్ బెల్ తో
ఆయమ్మ
"ఏందయ్యా సారూ?" అంటూ
దఫ్తర్ లో పెద్ద సార్
గుస్సాతో రైజైపోయి
బి.పి. పెరిగి
ఆగకుండా మోగిస్తుంటే
'మూడిందిరా భయ్!"
అనుకుంటూ
ఉగ్రనరసింహావతారంతో
వీరభద్రునిలా చిందులు
స్టాఫ్ మొహాల్లో
నెత్తురు సుక్క మాయం.
బెల్ మోతకి
రక్కున తీస్తే డేంజర్
చాకు పిస్తోల్ తో
ఖబద్దార్ దొంగలు
సేఫ్టీ ఛెయిన్ తో జాగ్రత్త
కిటికీలోంచి చూడకుండా
కంఠస్వరం వినకుండా
తీస్తే ఇల్లు గుల్ల
తస్మాత్ జాగ్రత్త!.

-ఎ.రాజ్యశ్రీ

ఒళ్ళు ఝుల్

కాలింగ్ బెల్ మోగిందంటే
కళ్ళు తిరుగుతాయండి!
పొద్దుటే
నిద్దుర లేచిన కాడ నుంచి
పిలిచే గంట ఎ
లుస్తూనే ఉన్నదంట.
పాలవాడు
పనివాళ్లు
వంటావిడ
పక్కింటావిడ
వీళ్లు చారలన్నట్లు
కొరియర్ బాబులు
రోజుకు కనీసం ఐదుసార్లు
కాలింగ్ బెల్ నొక్కుతూనే ఉంటే
సిట్ -స్టాండ్
వ్యాయామం
బుర్రంతా అయోమయం.
స్పూను నుండి
స్మూటర్ దాకా
ఆన్లైన్లో ఆర్డర్లు
ఇంటి కాలింగ్ బెల్
గొంతు చించుకొని
ఆరిచే అరుపులకు
తలుపులు తీయడం
వద్దురా బాబూ!.
ఆధునిక వసతులు
కొంత బాగానే ఉన్నా
మరికొంత
చికాకు కలిగిస్తున్నాయి.
మానవ సంబంధాలు
మరుగునపడుతూ
కొరియర్ బాబులు
కాలింగ్ బెల్
వీళ్లిద్దరే
మన బంధువులయ్యారు.
ఆధునిక కాల సౌకర్యాలను
"సుఖీభవ" అని దీవించాలో
పాతకాలపు
సుఖాలు పరిమితమైనా
అవి మళ్ళి వస్తే
బాగుండు అనుకోవాలో
తెలియని స్థితిలో మనిషి.
కాసేపాగండి
కాలింగ్ బెల్ మోగుతున్నది.
ఏ తోటకూర కాడో
పట్టుకొచ్చుంటాడు
కొరియర్ కుర్రాడు.
వస్తా మళ్లీ వచ్చి రాస్తా
కాలింగ్ బెల్
కాలక్షేపాయణం.

-డా.సి.వసుంధర

ధ్వని తరంగాలు

ఆ.వె. వేలసంఖ్య లోన కాలింగు బెల్లులు
మోగుచుండు వివిధ మోత తోడ
గడియతీయువరకు గళమెత్తిపాడుచు
రాగమొలుకచుండు రమ్యముగను!
ఆ.వె. గుడికి వెళ్ళినపుడు బడికి వెళ్లినగాని
చెవులకింపుగాను చేయు గంట
టన్నుమనుచుకొడితె ఎన్నోనుధ్వనులను
తీయుచుండు బెల్లు తిన్నగాను!

-జక్కని గంగాధర్

సౌకర్యం

తలుపో గేటో
పెట్టి ఉంచినా
తీసి ఉంచినా
కాలింగ్ బెల్ కొట్టి
తెలియజేస్తాం
కాలింగ్ బెల్ లేని
ఇండ్ల వారిని మాత్రం
నోటి ద్వారానే పిలవక తప్పదు
పేరు తెలిస్తే పేరుతో
లేకుంటే ఎవరండీ అని పిలుపుతో
కార్యాలయంలో పై అధికారులు
కింది అధికారులను
పిలిచి మాట్లాడాలన్నా
ఏవైనా చూసిన ఫైలు
తిప్పి పంపాలన్నా
బెల్ కొట్టగానే
బంట్రోతు సిద్ధం
కాలింగ్ బెల్ ఒకసారి మోగాక
కొద్ది సమయం ఇచ్చి మాత్రమే
మరొకసారి ప్రయత్నం మర్యాద
ఇంట్లో వారు ఏదైనా
ముఖ్య పనిలో ఉండి
వెంటనే రాకపోవచ్చు
కాలింగ్ బెల్ ఇంట్లో వారికీ
ఇంటికి వచ్చిన వారికి కూడా
ఒక సౌకర్యం.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

జయగంట

రాజుకు విన్నవించే జయగంట
దానిపై ప్రతి జీవికి అధికారమే
ఆపే వారు లేరు
న్యాయ పోరుకై
సమ్మతించిన మార్గం
సర్వ జీవులకు.
ముందుకాలం లేని హంగులు
అనుకరణకు వాడే రంగులు
మెచ్చే జనాలు పెరిగి
బుద్ధులు మరిగి
కొత్త పద్ధతులు
కొత్త వారి రాక తెలియజెప్పే
జాగ్రత్త తెలిపే పనికరం
ఇది గ్రహంబెల్ ఆవిష్కరణ.
శబ్దాలు వినిపించనప్పుడు
సంకేత పూర్వక గంట
ఉనికిని నేర్పుగా తెలిపే
రక్షణ, అవగాహన అనుపానాలు.
కాలింగ్ బెల్ ఇప్పుడు అలంకరణ.
గృహానికి నవీన కాంతులు
వన్నె చిన్నెలు
అల్లరి పిడుగులకు
ఆకతాయిలకు ఆయుధం
కలియుగ కాల అద్భుత విన్యాసం.
నిదురకు అవరోధం
ఎవరో అకాలంలో బెల్లు నొక్కితే
తప్పనిసరి బాధ అనుభవిస్తూ
సంతోషింపజేసే పరిస్థితి
తప్పనిది.
లాభాలతో పాటు
గ్రహ దోషాలు కూడా
అనుభవించక తప్పదు
ఎవరికైనా
ఈ కాలింగ్ బెల్ ఉన్నవారికి
కడగండ్లు కడవరకు !!!.

-కె.కె.తాయారు

ఓహోయ్

ఒకప్పుడంటే ఓహోయ్
ఇప్పుడంతా నాజూకే
ట్రిన్ ట్రిన్ మనగానే
ఎవరండీ అంటూ
తలుపు తెరుచుకుంటుంది.
పల్లెల్లో
ఇప్పటికీ కేకేయడమే
రివాజు
ఎల్లయ్య మల్లయ్య అంటూ
ఎరుక కలిగిన పిలుపులు
ఆత్మీయతలు తొంగిచూడంగా.
పట్నం బతుకులకు
తెలిసినవారు తెలియనివారు
ఎవరైనా సరే
పొడి పొడిగా
బెల్ మోగించితే కానీ
గుమ్మం తెరుచుకోదు.
కార్యాలయాలలో కదిలే
కాగితాలకు ఫైళ్లకు
అధికారి పురమాయింపులకు
ఆనవాయితీగా ఫ్యూన్ వచ్చి
హాజరంటాడు.
పిలుపులకు ప్రత్యామ్నాయం
ఇంట్లో కార్యాలయాల్లో
వేనోళ్ళ వేడుకోలుకు
దేవాలయంలో గంటల మోత .

-నగునూరి రాజన్న

పిలుపు గంట

పెరుబెట్టి పిలవటమో
తలుపు దబదబబాదటమో
నాటి రివాజు
నేడో
ఇంటికో కాలింగ్ బెల్
ఇంటి గేటుకో
ఇంటి దర్వాజాకో.
కార్యాలయంలో
అధికారికో బెల్
ట్రిన్ చప్పుడైతే
ఆఘమేఘాల మీద
బంట్రోతు హాజరు
ఇంట్లో మోగితే
ఎవరూ అంటూ
తెరుచుకునే తలుపు
కరెంటు గంట
బాటరీ గంట.
గంట ఏదయినా
చేసేది శబ్దమే
కర్ణ కఠోరం
కొన్ని శబ్దాలు
కుహు కుహు రాగాలు
కొన్ని గంటలు.

-మోటూరి శాంతకుమారి

స్వరలహరి

కాలింగ్ బెల్
స్వరలహరి
రకరకాల స్వరాలతో
పాటలు మంత్రాలు
అనేక అవతారాల శోభ
పూర్వం రాజుల దర్బార్లో
ధర్మగంట మోతలు
రాజులు బయటికి రావడం
రాజులకు ప్రజలకు మధ్యవర్తిగా
కోటగుమ్మాన అలరించేది
ఈనాడు ప్రతి ఇంట
ఎవరో వచ్చారని సూచన
ఆఫీసులో బాస్ పిలుపుకు
ఆ శబ్దం వినపడగానే
ఎక్కడి వారు అక్కడ
పరుగులు తీయడమే
వంట ఇంటి ఇల్లాలికి
కూరలవాడా పాలవాడా
ఆ పిలుపుకు
చేస్తున్న పని ఆపి
చేయి తుడుచుకుంటూ
ఒడివడిగా పరుగులు
ఇంటి యజమానికి
పక్కింటి ఆయన
పేపర్ బోయ్ వాచ్ మేనా
అన్న ఆలోచన ప్రవంతి
పిల్లలు తమాషాకి
కాలింగ్ బెల్ నొక్కటం పరిపాటి
అన్నీ నిత్యకృత్యాలే
ఇంటింటి రామాయణం
మా ఇంటస్వర లహరి
తొందర వద్దు
బెల్ మోగగానే
అనాలోచితంగా
తలుపులు తీయొద్దు
కిటికీ నుండో
తలుపుకున్న
చిన్న అమరిక నుండో చూసి
తలుపులు తెరవండి
సీసీ కెమెరాలు ఎన్ని ఉన్నా
జరగవలసిన జరుగుతూనే ఉన్నాయి
అవతలి కంఠస్వరం విన్నాకే
తలుపులు తెరవండి.

-ఆర్.రమాదేవి

వామనాకారం కళా ప్రక్రియలో బాహుబలి బ్నిం

చిత్ర కారుడు కార్టూనిస్ట్ బ్నింకు 'సుబ్రహ్మణ్య శాస్త్రి చిత్ర లేఖన'బ పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు.

హైదరాబాద్, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): బ్నింగా పిలువబడే నరసింహారావు వామనాకారం కాగా కళా ప్రక్రియలో బాహుబలి అని ప్రముఖులు కొనియాడారు రవీంద్ర భారతి లోని సమావేశ మందిరం లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విఖ్యాత రంగస్థల ప్రయోక్త చిత్ర లేఖకుడు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి కళా పీఠం నిర్వహణ లో సుబ్రహ్మణ్య శాస్త్రి 88 వ జయంతి పురస్కరించుకొని చిత్ర కారుడు కార్టూనిస్ట్ బ్నింకు సుబ్రహ్మణ్య శాస్త్రి చిత్ర లేఖన పురస్కార ప్రదానం సభ జరిగింది ముఖ్య అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు పాల్గొని పురస్కారం బహుకరించి మాట్లాడారు సుబ్రహ్మణ్య శాస్త్రి స్త్రీ పాత్రలు ధరిస్తూ నాటకాల్లో ఖ్యాతి పొందారని అయన చిత్ర కళ లో కూడా అందెవేసిన చెయ్యి అని చెప్పారు బ్నిం చిత్ర కళలో దిగ్గజం అని ఎన్నో నృత్య రూపకాలకు ఆయన సాహిత్యం అందజేశారని వివరించారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి రఘురాం అధ్యక్షత వహించి బ్నిం ప్రతిభను తెలిపారు కార్టూనిస్ట్ శంకు నాట్య గురువు పసుమర్తి శేషబాబు తదితరులు పాల్గొని తమ అభినందనలు తెలిపారు సంస్థ అధ్యక్షుడు రేవతి రామకృష్ణ స్వాగతం పలికిన సభలో కార్యదర్శి భాగి శాస్త్రి నివేదిక సమర్పిం చారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులు మల్లాది గోపాల కృష్ణ పరమేశ్వర్ వెంకటస్వామిలకు ఆత్మీయ సత్కారం చేశారు తొలుత వైష్ణవి భరత నాట్య ప్రదర్శన, చిత్రలేఖకులు స్కిట్ స్వర సామీప్యం స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులచే చిత్రలేఖన కార్యక్రమం జరిగింది... కార్యక్రమం వ్యాఖ్యాతగా శ్రీమతి ప్రపుల్లా సుందర్ వ్యవహరించారు.

మధ్య తరగతోళ్ళ మాండలికం

మన దేశంలో అటు ఉన్నత వర్గాల్లోనూ ఇటు అట్టడుగు స్థాయి వారిలోనూ కనిపించని ఏకైక మాండలికం మధ్యతరగతోళ్ళది. తెల్లవారి మేల్కొని రాత్రి నిద్రపోయే వరకు చేసే పనులలో పలికే మాటలో 90 శాతం కుటుంబాలలో వ్యక్తుల్లో సమస్యలు... సమస్యలు... సమస్యలు సతమతాలు నొప్పులు రోగాలు ఆర్థిక ఇబ్బందులు కొట్లాటలు గొడవలు ఇవి ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాల్లోనే జరుగుతుంటాయని ఆర్థిక ఆరోగ్య మానసిక ఇంకా పలువురు నిపుణుల విశ్లేషణలో వెల్లడయింది. దీనికంతటికీ ప్రధాన కారణం ఆర్థికపరమైన ఇబ్బందులే అని తేటతెల్ల మైంది. పుట్టుకతోనే శ్రీమంతుల కుటుంబాల్లో పుట్టిన వారు దాన్ని అలాగే కొనసాగించుకుంటూ ముందుకు సాగుతారు.పుట్టుకతోనే అట్టడుగు స్థాయిలో ఉన్నవారు ఎటువంటి ఆశలు దురాశలు లాంటివేవీ లేకుండా బ్రతికితే చాలు అనుకుంటూ గడిపేస్తారు.కానీ మధ్య తరగతి వాళ్ళకి రకరకాల ఆలోచనలు పుట్టుకొచ్చి రకరకాల సమస్యలు కొనితెచ్చుకుంటారు. ఇది ప్రతి మధ్యతరగతి కుటుంబంలో ప్రతిరోజు జరిగేదే! అందులో కొందరు మా బతుకులు ఇంకెప్పుడు మారాలి మరి కొందరు మా బతుకులు మారే మార్గమే లేదా అని,ఇంకొందరు మరో అడుగు ముందుకేసి మా తలరాతలు ఇంతే!?.. అంటూ కాలం గడిపేస్తారు. కుటుంబంలో ఉన్న నలుగురిలో పనిచేసేది ఇద్దరు.కూర్చుని తినేది ఇద్దరు. ఆదాయం తక్కువ వ్యయం ఎక్కువ ఏం కొనేటట్టు లేదు!ఏం తినేటట్టు లేదు!!అనే పాట మధ్యతరగతోళ్ళ గురించే పుట్టిందికాబోలు. 500 జేబులో వేసుకుని సరుకుల సంచి పట్టుకొని మార్కెట్కు వెళ్తే నాలుగైదు రకాల కూరగాయలు రాకపోకల ఆటో చార్జీలు అంతటితో 500 ఫినిష్... అవి రెండు రోజుల వరకు మాత్రమే ఆ తర్వాత మళ్లీ "పొట్టకూటి కోసం పాకులాట" "మధ్యతరగతోళ్ళ ఆకలి చావులాట" ఈ పరిస్థితి ఒక్క భారతదేశంలోనే ఎక్కువ కనిపిస్తుందని బైటి దేశాలకు వెళ్ళొచ్చిన చాలామంది అనుకుంటున్నమాట. శతాబ్దాలు గడిచిపోతున్నా...మధ్యతరగతి బతుకులు మాత్రం సమస్యలు... సమస్యలు... సమస్యలు అంటూనే ఉదయం నుండి రాత్రి వరకు ఇదే మాండలికం ఎక్కువగా వాడుతుంటారు.చుట్టాలు స్నేహితులు ఆప్తులు పరిచయం ఉన్న లేకపోయినా అందరితోనూ మధ్యతరగతి ప్రజలు మాట్లాడే మాటల్లో కష్ట సుఖాల గురించి ఎక్కువగా చెప్పుకుంటారు. ఇంటి కొచ్చిన చుట్టం మర్యాదలు సరిగ్గా చేయకపోతే ఏమవుతుందో ఏమనుకుంటారు.అన్న ఆలోచన ఒక పక్క గుండె లోతుల్లో తొలుస్తున్నప్పటికీ అప్పో సప్పో చేసి చుట్టం ఉన్నంటుతున్నారు. వీరి బతుకులు మారాలంటే ప్రభుత్వాల పరిపాలకుల ఆలోచన విధానంలో మార్పు రావాలి. సంపన్న వర్గాలకు కొమ్ముకాసే ఆలోచన విధానాలను మార్చుకొని పేదల జీవితాల్లో వెలుగును నింపే ఒక గొప్ప ప్రణాళికలను రూపొందించే పథకాలను తీసుకురావాలి. నిత్యవసర సరుకుల ధరలను పెంచకుండా

గులాబీలు

(కథ)

మంచు దుప్పటి దట్టముగా అలుముకుని ప్రకృతి కాంతకు తెల్లచీర కట్టినట్టుగా వుంది. పైరగాలి ఒయ్యారం ఒలకబోస్తు వీస్తుంది. శరీరంపై రోమాలు నిల్చోని ఒల్లంత తిమ్మిర్లు ఎక్కినట్టుగా వుంది. ఉదయం ఆరు దాటిన రోడ్లన్ని నిర్మానుష్యంగా వున్నాయి.

అతను శాలువాను భుజాలపై నుండి చక్క గా కప్పుకుని త్వరత్వరగా పూలబుట్టను తీసుకుని తోటలోకి వెళ్ళి తోటంట కలియ జూశాడు.

లేతకిరణాలను తాకి ముత్యాల్లా మెరుస్తున్నవి పూలు. వాటిపై మంచు బిందువులు.ఆ దృశ్యాన్ని వర్ణింప అక్షరాలు చాలవన్నట్టుగా వుంది. తోటంతా భూదేవి వెడలో పూలహారం వేసినట్లుగా వుంది. తుమ్మెదలు ఒక్కొక్కటి భయట కువచ్చి ఝుమ్మంటూ ఆహ్లాద గీతం వల్లిస్తు న్నాయి.

ఒక్కో పూవులో కొన్ని వేల మెగావాట్ల విద్యుత్ శక్తి ఉత్పత్తి అవుతున్నట్లుగా వుంది. అతను తోటలోని ఒక్కో పూవ్వును కోసి బుట్టలో వేశాడు.

కోటి ఆశలతో కొండంత ధైర్యంగా ఏదో సాధించాలి అనే తలంపుతో గడియారంలోని ముల్లుతో సమానంగా కదులుతున్నాడు.

చిగురిస్తున్న ఊహలకు రెక్కలు కట్టుకుని ఓ కాలేజి గేటు ముందు బుట్టను తీసుకునివచ్చి నిల్చున్నాడు.పక్కనే వున్న చెట్టు కింద పూలను సర్ధి తాను కూర్చున్నాడు.

అప్పుడప్పుడే కాలేజికివచ్చే అమ్మాయిలు అబ్బాయిలు "నాకు గులాబీ .... నాకు గులాబీ" అంటు అతనిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. కొందరు అమ్మాయిలు జడలో తురుముకోడానికి మరికొందరు

అబ్బాయిలు వారికి నచ్చిన అమ్మాయిలకు బహుమతిగా ఇవ్వడానికి ఇంకొందరు కొంటె కోసంగి కుర్రాళ్ళు కొందరమ్మాయిలను ఆటపట్టించడానికి తుమ్మెదల్లా అతని చుట్టూ మూగినారు.

ఒక్కొక్కరిది ఒక్కోస్వభావం.ఎవరిది ఏ స్వభావమైనా కల్మశంలేని హృదయాలలో ఆనందాల తోరణాలు స్నేహపూరితమైన రంగుల హరివిల్లులా విరిసే దృశ్యతీరమే కాలేజి తీరం.

పూవులన్ని అయిపోతున్నవి తను ఎదురు చూసే అమ్మాయి ఇంకా రాలేదు. చుట్టు పరిశీలనగా చూశాడు.స్టూడెంట్సు అంతా చెట్లకింద గుంపులు గుంపులుగా నిల్చున్నారు. తను చూసే ప్రణయకాంత ఏ గుంపులోను కనిపించలేదు.

ఒక గులాబీని తీసి దానిని ప్రేమగా నిమిరి పెదాలతో చుంబించి కవరులో చుట్టి పక్కన పెట్టాడు.అది తనను ఓదార్పుగా చూస్తున్నట్టుగా వుంది.అందరు క్లాస్ రూమ్ ల్లోకి వెళ్తున్నారు. ఒక పదినిమిషాలలో కాలేజి ఆవరణంతా నిశబ్దం పులుముకుంది.ఎందుకో అతనికి అటు వైపు చూడాలనిపించలేదు.

చిలుక కోసం గోరింకలా ,కోయిల కోసం వసంతంలా, చంద్రుడి కోసం కలువలా, సముద్రుడి కోసం నదిలా విరహవేదన తాళలేక నా ప్రణయ దేవతను చూడాలని వచ్చాను.

స్నేహం! ఆప్యాయత! అనురాగం! ప్రణయ బంధాల మూలసూత్రం. రెండుఅక్షరాల అమృతవర్షిణి ప్రేమంటారు కదా! దేవుడా నేను ప్రేమించడం నేరమా? ఈ ప్రపంచంలో ఎవరు చేయని దోశమా? ఒకవేళా అదే నిజమైతే ఈ మనుషులెందుకు? ఈ సృష్టి ఎందుకు?అని మనసులో అనుకుంటు దేవుడిని పరిపరి విధాలుగా వేడుకుంటు పూలబుట్ట పట్టుకుని మౌనంగా భయలుదేరాడు.

"ఎక్స్ క్యూజ్ మీ"అన్న పిలుపు తీయని కోయిల కంఠంలా వినిపించడంతో వెనుదిరిగి చుశాడు.ముగ్ధమనోహరమైన సుకుమార నా సౌందర్యరాశి. తలంటు స్నానం చేసిందేమో ఆ కురులింక ఆరనులేదు.వంకలు తిరిగిన నదిపాయలలా వున్నాయి ముంగురులు.పింకు కలర్ డ్రెస్ లో తన అందమైన గుండ్రని మొఖం ,సాగర మీనాల్లాంటి అభినయ నేత్రాలు మందార రేకుల్లాంటి ఎర్రని పెదాలు మంచు శిఖరాల్లాంటి వక్షద్వయం చూడగానే అబ్బుర పరిచే పాలరాతి శిల్పంలా వుంది. దేవుడు నామొరనాలకించాడేమో! అని మనసులో అనుకుంటు కృతజ్ఞతలు తెలుపుకుని ఆనందంతో వచ్చే కన్నీళ్ళను తుడుచుకున్నాడు.

శుక్రవారం గుడికేళ్ళి కంప్యూటర్ క్లాస్ కి వెళ్ళిరావడంతో లేట్ అయింది. ప్ల...వ...ర్ కావాలి ఇవ్వరు తడబడుతు చేయిచాచి మెల్లగా అంది.

నిశ్చల స్థితిలో నిల్చుని తధేకంగా ఆమెనే చూస్తు ఈ కాలం ఇలాగే ఆగిపోయి ఈ కనులు ఇలాగే నిల్చిపోతే ఎంత బాగుండునో అనుకున్నాడు.

"గులాబీ పూవు ఇస్తార ఇవ్వరా ? ఆ గాటు చూపులను తప్పుకుంటు అంది.

"ప్లవర్సు అయిపోయాయండి" తమాషాగా ఆటపట్టిస్తు అన్నాడు.

ఒక్కసారిగా ఆమె ముఖం పాలిపోయింది. వాచి వంక చూసుకుంటు భరువుగా వెనక్కి తిరిగింది.

"హలో మేడమ్ ...యూడోంట్ వరి టేక్ దిస్ ప్లవర్ "అంటు తను కవర్లో దాచిన ప్లవర్ ను తీసి ఇచ్చాడు.

మెర్కురి బల్బులా తేజోవంతమైంది ఆ మొఖం. దేవుడు పూవులకోసం ఆడవాల్లను పుట్టించాడో లేక ఆడవాల్ల కోసమే పూలను పుట్టించాడో గాని ఆ పూవులకు వారికి వున్న బంధాన్ని ఎంత మంది కవులు వర్ణించిన తక్కువేనేమో!

పర్సు నుండి డబ్బులు తీసి "ఇదిగోండి డబ్బులు " అంది.

'ఈ పూవులు నీవిచ్చే డబ్బుల కోసం కాదు నీ ప్రేమ కోసం అని చెప్పాలని వుంది, కాని ఏదో సంశయం.

"ఇదిగోండి డబ్బులు తీసుకోండి"ఆ గొంతు నుండి పదే పదే వినిపిస్తున్న మాట.

"సారీ అండి నాకు డబ్బులు వద్దు"

"రోజు ఇలానే అంటారు ఎందుకు?"

"ఆ పూవును డబ్బుతో వెలకట్టడం నాకు ఇష్టం లేదు" మెల్లగా అన్నాడు.

ఇద్దరీ మధ్య అయిదు నిమిషాలు మౌనం రాజ్యమేలింది.

"మిమ్మల్ని చూస్తే బాగా చదువుకున్న వారిలా వున్నారు. ఈ ప్లవర్స్ ఎందుకు అమ్ముచున్నారు."

"అది ఓ పెద్ద కథ అండి"

ఒక పూలవాడిని ప్రేమించటం నేరమా? అలా చేస్తే ఈ సమాజానికి నేను చులకనవుతానా? అయినా ఈ సమాజం ఎప్పుడు ఇంతే ఒక వ్యక్తి ఇది తప్పు అంటే చాలు అదే కోడయి కూస్తుంది.కాని ఇది ఎలా తప్పవుతుందని ఒక్కరు ప్రశ్నించరు. కులం, మతం, వయసు, భాష, ప్రాంతీయబేధం లేనిది ప్రేమ. ఈ సృష్టిలో దేవుడు మనిషికిచ్చిన గొప్ప వరమే ప్రేమ.

"ఔనా! కథలు అంటే నాకు చాలా ఇష్టం చెప్పరు."

"టైం వచ్చినప్పుడు చెబుతాను"

"ఏ ఇప్పుడు చెప్పకూడదా "వాచ్ వంక చూసుకుని మనసులో ఎలాగు టైం వుంది కదా అనుకుంది.

"దేనికైన ఓ సమయం రావాలి కదా లేకుంటే దాంట్లో థ్రిల్ ఏముంటుంది కథ చెప్పలేదని మీరేం ఫిల్ అవ్వకండి ఏరోజుకైన తప్పకుండా చెబుతాను."

''చాల ఇంట్రెస్టింగ్ స్టోరీలా వుంది నాకోసమైన ఆ టైం తొందరగా రావాలని కోరుకుంటున్నాను."నవ్వుతు అంది.

తలుకు మంటు మెరిసిన ఆ పలువరుస మృదువుగా మనసుకు హత్తుకుంది.

నేను ఆ టైమ్ కోసమే ఎదురుచూస్తున్నానని చెప్పాలనుకున్నాడు.

"క్లాస్ కు టైం అవుతుందండి"అంటు అక్కడ నుండి కదిలింది.

ఆకాశంలో కదిలిపోయే మేఘంలా వుంది.తను కనుమరుగయ్యే వరకు చూసి ఆనందంగా పూలబుట్టను గాలిలోకి ఎగిరేస్తు అక్కడనుండి కదిలాడు.

×××××

కిక్కిరిసిన జనంతో వున్న బస్ వచ్చి ఆగింది. జనాన్ని తోసుకుంటు దిగి నుదుట పట్టిన చెమటను కర్చీప్ తో తుడుచుకుంటు గేటు పక్కనున్న చెట్టువైపు గబగబ నడుస్తు ఒక్కసారిగా ఆగింది.

అతను కనిపించలేదు. దాంతో ఆమె ముఖం పాలిపోయింది. చుట్టూ వెతికింది కనుచూపు మేరలో అతను ఎక్కడా కనిపించలేదు.

అతను లేకుంటే ఆ ప్రదేశమంతా చిన్నబోయినట్టుగా అనిపిస్తుంది.

'ఏమై పోయాడు ఎంత వర్షం పడిన పిడుగులు పడిన ఈ ప్రకృతే తన నేస్తంలా భావించే భావుకుడిలా వుంటాడు,ఏదో సాధించాలి అనే కాంక్షతో ఆ కళ్ళలో మెరుపు కార్యసాధనకు దీక్షబూనిన ఋషివుంగవుడివలే వుంటాడు. అందరిని కొంటె చేష్టలతో కవ్విస్తు నవ్విస్తూ ఎంతో సరదాగా ఉండే వాడు. అలాంటి చిలిపి కృష్ణుడు ఈ రోజు ఎందుకురాలేదు? ఇప్పుడు ఈ వాతావరణం ! ఈ ప్రకృతి! ఈ మనుషులు రోజులాగా ఎందుకో అందంగా కనిపించటం లేదు. నిన్నటి ఈ గడియల్లో పరిమలం వెదజల్లుతూ మనసును తాకి పులకరించేసిన ఆ పూవులరేడు ఎక్కడా? తాను ఎక్కడా?

అతను తెచ్చే ఆ పూవులలో అంత మహత్యం ఏమిటో ..? అవి ఏమైనా దేవలోకం నుండి తెచ్చినవా..? లేకా ఇంద్రలోకం నుండి తెచ్చినవా..? అతని పూవులలోనీ మహిమ లేక అతని చూపులలోని మత్తు మెల్లగా ఆమె మనోఫలకంపై భావాక్షరాలయినాయి.

నాకు తెలిసి అతను నేను కాలేజిలో చేరినప్పటి నుండి వస్తున్నాడు,చెదిరిపోయిన క్రాఫ్ ను ఎప్పుడు సరిచేసుకుంటు చెదిరిపోని చిరునవ్వుతో ఎప్పుడు ఆకర్షించే రూపంతో ఉండేవాడు, అందమైన గుండ్రని మొఖం రింగులు తిరిగిన ఉంగరాలజుట్టు విశాలమైన చాతి సన్నగా తెల్లని రంగుతో ఎంతో హుందాగా కనిపించేవాడు.

ఒక అపరిచిత వ్యక్తి గురించి ఇంత ఇదిగా ఆలోచిస్తున్నాను ఏంటి? మరిచి పోదామంటే మరపురావడంలేదు.

తికమక పెడుతున్న ఆలోచనలు ఆమెను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. దీనినే ప్రేమంటారు కాబోలు. తప్పటడుగు వేస్తున్నానా? ఒక పూలవాడిని ప్రేమించటం నేరమా? అలా చేస్తే ఈ సమాజానికి నేను చులకనవుతానా? అయినా ఈ సమాజం ఎప్పుడు ఇంతే ఒక వ్యక్తి ఇది తప్పు అంటే చాలు అదే కోడయి కూస్తుంది.కాని ఇది ఎలా తప్పవుతుందని ఒక్కరు ప్రశ్నించరు. కులం, మతం, వయసు, భాష, ప్రాంతీయబేధం లేనిది ప్రేమ. ఈ సృష్టిలో దేవుడు మనిషికిచ్చిన గొప్ప వరమే ప్రేమ.

అందరు క్లాస్ రూమ్ లకు వెళ్తున్నారు.కాలం కదిలిపోతుంది. క్లాసులన్ని అయిపోతు న్నాయి. ఆమెకు ఏ క్లాస్ లోను నిలబడాలనిపించలేక ఇల్లు చేరింది.

మన్మధుడిలా పూలబాణాలు వేసి మనసును కొల్లగొట్టావయ్యా!మోహనరూప చిలిపిగా ఎదలయను మీటి ఎవరికి చిక్కకా ఏమి ఎరగని వాడిలా దాక్కున్నావా? నీ ముఖారవిందాన్ని మబ్బులోని జాబిల్లిలా నా హృదయంలో చిత్రించుకున్నాను,నీ గులాబీ కోసం నా చేతులు అల్లాడిపోతున్నాయి.ఏమైపోయావు నేస్తమా? నీ విరహం నేను భరింపజాలననుకుంటు బెడ్ పైన అటు ఇటు దొర్లుతుంది.

××××

ఫిబ్రవరి 14 వాలెంటెన్స్ డే ఉదయాన్నే నీటుగా జుట్టు కత్తిరించుకుని క్లీన్షేవ్ చేసుకుని మంచి డ్రెస్ సెలక్టు చేసి వేసుకుని టక్ వేసుకుని బెల్టుపెట్టుకుని షూ వేసుకున్నాడు.మళ్ళీ మళ్ళీ తన మొఖాన్ని అద్దంలో చూసుకున్నాడు అతను.

ఎప్పటిలాగా పూవుల బుట్టను కాకుండా ఒకే ఒక్క గులాబీని తీసుకుని ఎదురుగా వున్న గిఫ్ట్ సెంటర్లో గ్రీటింగ్ సెలక్ట్ చేసుకుని భయలుదేరాడు,ఈ రోజు ఎంతో సుదినం ప్రేమికులు తమ మనసులోని భావాలను ప్రేయసి ప్రియులకు వ్యక్తం చేసే రోజు.ఒప్పుకుంటే అనందం లేకుంటే విషాదం.

ప్రతిరోజులాగే మెల్లగా వచ్చి గేటుముందు నిల్చున్నాడు.అప్పుడే బస్ దిగి అడుగులో అడుగు వేసుకుంటు హంసలా అటువైపు వస్తుంది ఆమె.

నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటు గ్రీటింగ్ ఎలా ఇవ్వాలి? ఇస్తే ఆమె ఎలారియాక్టు అవుతుందో అని ఆలోచిస్తున్నాడు.

ఆమె అతన్ని సమీపించింది.

కనులు కనులను దోచుకుంటున్నవి ఒకరికండ్ల లోనికి ఒకరు తీక్షణంగా చూసుకున్నారు. ఈ సమయం దాటిపోతే తిరిగిరాదు అనుకుని చేతిలోనీ కవరును గులిబీని ఆమెకు అందించాడు.ఆమె సిగ్గుపడుతునే తీసుకుని తనను పరిశీలించి చూసింది,ఆ మొఖం గతంలో ఎక్కడో చూసినట్టు అనిపిస్తుంది ఎక్కడా..? ఆలోచించుకుంటూనే ఏమి చెప్పకుండా గేట్ లోనికి వెళ్ళింది. విజయం సాధించిన వీరుడిలా ఉప్పొంగిపోతు ఎగిరిగంతులు వేశాడు.

ఆమె గ్రీటింగ్ చూసి అతను రాసిన ఉత్తరం చదవసాగింది.

వందన

నీకు వందనం

ప్రియా!కనులు కనులను దోచినప్పుడు మనసు మనసు మనసును తాకినప్పుడు ఎదలయల్లో తారాడే సంఘర్షణయే ప్రేమ.అది ఓ అమృత భాండాగారం.ప్రేమించగానే సరిపోదు ప్రేమించిన వారిని స్వంతం చేసుకున్నప్పుడే ఆ ప్రేమకు పరిపూర్ణమైన స్థానం ఏర్పడుతుంది.

స్కూల్ అయిపోగానే ఫ్రెండ్స్ మంతా కలిసి పొలంగట్లల్లో కొండలు కోనలు నది ఒడ్డున ఇసుకలో ఆటలతో పాటలతో కాలం ఎంత అందంగా గడిచిపోయేది. మామిడితోటలో మనం చేసిన దొంగతనం,కాకెంగిలితో పంచుకున్న ఓనగాయలు ఎన్నెన్ని జ్ఞాపకాలతో చెరిగిపోని దృశ్యాలుగా ఎప్పుడు నన్నువెంటాడుతున్నాయి.

ఒక రోజు స్కూల్ నుండి వచ్చేటప్పుడు తోట బంగ్లాలో గులాబీ తీసుకువచ్చిన వారికి జీవితాంతం తోడుంటనన్నావు.దాంతో నేను సురేష్ ఇద్దరం బంగ్లా దగ్గరకెళ్ళాక భయంతో సురేష్ వెనుదిరిగాడు.నేను ధైర్యంగా పూలు తీసుకవస్తే విసిరికొట్టావు.ఏ పూలనైతే విసిరి కొట్టావో అదే పూలకోసం ఆ పూలు తెచ్చేవాడి కోసం ఎదురుచూసేలా చేశాను.

ఇప్పుడు ఎప్పుడు నా గమ్యం నా ప్రస్థానం నీవు.నా కోసం ఇకనైనా మనసిస్తావో ! ద్వేషంతో నన్ను మళ్ళీ శపిస్పావో! నీ నిర్ణయానికే ఒదిలేస్తున్నాను,

నా కోసమైన కథ చెప్పడానికి టైమ్ రావాలి అన్నావు.అది ఇప్పుడు వచ్చింది చెప్పాను

ఇప్పటికైనా నేను ఎవరో గుర్తుకు వచ్చానా?

ఇట్లు

నీ ప్రేమకై నిత్యం తపించు

వంశీ

నా మనసులో స్థానం సంపాదించుకోడానికి ఎంత కష్టపడ్డావు వంశీ, నీవు నిజమైన ప్రేమికుడివి, నేను నీ ప్రేమదాసిని,అని అనుకుంటు అతను ఇచ్చిన గులాబీని ముద్దుపెట్టుకుని గ్రీటింగ్ ను హృదయానికి హత్తుకుంది. ఆమె కండ్లు ఆనందంతో వర్షించాయి.అతని కోసం తెచ్చిన గ్రీటింగ్ ను చూసి "యూ ఆర్ ఏ సో లక్కి"అనుకుంటు పరుగెత్తుతు గేట్ భయటకు వచ్చింది.

అతను ఆమె కోసం రెండు చేతులను చాపి నిల్చున్నాడు.

అమె అతన్ని గట్టిగా వాటేసుకుని "ఐ లవ్ యూ " అంది.

అతను "ఐ లవ్ యూ"అన్నాడు.

చెట్టుపై మంచు బిందువులు అక్షింతాలుగా రాలినాయి.

– వజ్జీరు ప్రదీప్
9989562991

ధ్వని

మాట్లాడాలని అనుకున్నప్పుడు
మౌనం రాజ్యమేలుతుంది
ధ్వని వినాలనుకున్నప్పుడు
నిశ్శబ్దం కత్తులు విసురుతుంది.
సముద్రముప్పొంగినట్టు
హృదయం ద్రవిస్తుంటే
ఉచ్ఛ్వాసనిశ్వాసల్ని పసిగట్టటానికి
గుండె గోడల్ని తడుముకోవాలి !.
మౌనం కదలని పర్వతం
భూకంపాలూ
లావాలూ మాయమయ్యాయి.
కనుగుడ్లు శిలలు
భంగిమలుభంగిమలుగా చెక్కాలి
దృశ్యాలు నాట్యాలు నాట్యాలుగా
దర్శనమిస్తాయి.
మూగ గొంతుకొమ్మకు
మాట చిగురించటానికి
కనిపించే చీకటికూపంలో
నిశ్శబ్ద చెలిమ వాగై పొంగటానికి
అడ్డగాఉన్నఇనుపగోడల్ని కరిగించే
ఎదురుగా కణకణలాడుతున్న
కవోష్ణకంచు గంటను మోగించాల్సిందే !.

–కందుకూరిశ్రీరాములు
9440119235

ఓ జ్ఞాన దంతమా!

ఓ జ్ఞాన దంతమా
చివరికి వచ్చే చిగురింతమా
నోటి కుహరములో
నాలుగు వైపుల సరిహద్దంతమా!.
ఇరవై ఎనిమిది పళ్ళకు తోడుగా
యుక్తవయసులో వచ్చే విశేష
విజ్ఞాన సుజ్ఞాన దంతమా!.
నువ్వు వస్తే పెద్దవారివై పోతామా
హాయిగా ఆడుకునే పిల్లలం కామా
నువ్వంటే జ్ఞానమే మా సొంతమా!.
హక్కుల్ లేదా బుద్ధి లేదా
హక్కుల్ దౌడ రాలేదా
అని అందరూ తిట్టడమా!.
నువ్వు వచ్చేటప్పుడు నొప్పి నొప్పి
నువ్వొడిపోతే తొత్తి తొత్తి
మా కెందుకింత సుత్తి సుత్తి!.
వైద్యులు నువ్వుత్తని పీకేస్తారు
వైద్యానికి నువ్వు అందవా
అందానికి అంత తగవా !.
ఎంత నవ్వినా ఏడ్చినా కనిపించని
ఓ జ్ఞాన దంతమా వింతోదంతమా!

–పి.బక్కారెడ్డి
9705315250

కత్తులను పువ్వులుగా మార్చి

నీవు కనబడంగానే
నా ఆలోచనలు రక్తం తాగి
భగభగ మండుతూ
కత్తులు ఎత్తు కుంటాయి.
నీవు మాత్రం నా ముందు
చేతులు కట్టుకొని నిలుచుంటావు
ఎంతకు అర్థం కావు.
కాలం తీరాక
నీవు ఎక్కడో మట్టి కప్పుకొని
పడుకుంటావు.
నేను ఈ అగ్గి కీలలలో
ఇక్కడే భగభగమండీ
నుసి నుసి అయిపోతా.
ఇంత మాత్రానికి
ఎందుకో ఈ భగభగలు
ఒకరిపై ఒకరికి
ఒకరి భుజాలపై ఒకరము
చేతులేసుకుని
ఈ లోకాన్ని ఆస్వాదిస్తే
సరిపోదా

–గుండెల్లి ఇస్తారి
9849983874

ఏడ్వడానికి నల్గురు??

కాటి వరకు
మోయడానికే కాదు–
చివరకు
గుండెలు బాదుకుని
ఏడ్వడానికీ
సమూహమై
నల్గురుండాలి–
ఊరి యాదిగా
మైత్రీ వనంగా
బతికిన బతుకంటే ఇదే మరి

–కందాళై రాఘవాచార్య
8790593638

సుందరవనం అనే అడవిలోని సింహం ఒకసారి జంతువులను సమావేశపరిచి "జంతువులారా ! మీరు చేసిన ఏదైనా మంచి పని ఉంటే చెప్పండి. రాబోయే జంతువుల పండుగ ఉత్సవాల్లో మిమ్ము సత్కరిస్తాను"అని అంది. అది విన్న నక్క" మృగరాజా! నేను అడవిలో ఉన్న క్రూరమృగాలకు చిన్న జంతువుల జాడను చెప్పి వాటికి సాయపడ్డాను" అని అంది. అది విన్న సింహం "నీవు చెప్పకున్నా వాటి జాడను అవి తెలుసుకొని ఉండేవి.అయినా ఆ చిన్న జంతువులను నీవు చంపించడం ఏమీ బాగాలేదు.పైగా అదొక గొప్ప పని అన్నట్లు నీవు విర్రవీగుతున్నావు. నీ స్వార్థంతో అవి మిగిల్చే ఆహారం కొరకు నీవు ఈ పని చేశావు. నాకు తెలియదా!" అని అంది. అప్పుడు నక్క చిన్న బుచ్చుకుంది .

తర్వాత ఒక జింక లేచి "మృగరాజా ! నేను ఒక పులికి దొరకకుండా తప్పించుకుని దానిని ముప్పు తిప్పలు పెట్టాను" అని అంది.అది విన్న సింహం "ఆపదలో ఎవరైనా అలాగే చేసి తప్పించుకుంటారు. అందులో నీ గొప్పతనం ఏముంది" అని అంది. ఆ మాటలకు జింక కూడా మౌనం దాల్చింది.

తర్వాత ఒక కుందేలు లేచి "మృగరాజా! నేను గొప్ప పని ఏమీ చేయలేదు.కానీ మనకు వైద్యం చేసే ఎలుగుబంటి నేను కలిసి నిన్న ఒక నిండుప్రాణం కాపాడడం కొరకు ఒక నది దాటి బయటకు వెళ్ళాము. అప్పుడు ఆ నదిలో నీరు చాలా తక్కువగా ఉంది. కానీ మా పని పూర్తయిన పిదప మేము వచ్చేటప్పుడు వరద ఎక్కువై ఆ నది నిండుగా ప్రవహిస్తున్నది. అప్పుడు నేను ఒక క్రూరమైన మొసలితో "మొసలి మామా! ఈ ఎలుగుబంటి అత్యవసరంగా ఈ నదిని దాటాలి. మిగతా మొసళ్ళను దీనిని ఈ నది దాటించమంటే ఇది చాలా బరువుగా ఉన్నదని అవి పెదవి విరిచాయి. నీవు దీన్ని దాటిస్తే నీవే గొప్పదానివి అవుతావు. నీకు మృగరాజుతో చెప్పి సత్కారం చేయిస్తాను" అని అడిగాను. అందుకు మొసలి " ఒక్క ఎలుగే కాదు. దానితోపాటు నిన్ను కూడా నేను ఎక్కించుకొని ఈ నది బయటకు దాటిస్తాను" అని మా ఇద్దరినీ ఏకకాలంలో అది నది దాటించింది. ఇక ఇక్కడ ఇప్పుడు ఎవరు అస్వస్థులైనా భయం లేదు. వైద్యం చేసే మన ఎలుగు బంటి క్షేమంగా తిరిగి వచ్చింది "అని అంది .

అప్పుడు సింహం "ఓ కుందేలా! నువ్వు చాలా మంచి పని చేశావు.అందరికీ వైద్యం చేస్తూ పరులకు ఉపయోగపడే ఈ ఎలుగుబంటిని క్రూరమైన మొసలి వీపు పైన ఎక్కించి తీసుకొని వచ్చావు. అందువల్ల జబ్బుపడ్డ అందరి ప్రాణాలను నీవు రక్షించినట్లయింది. నీకు ఈ ఉత్సవాల్లో సన్మానం చేస్తాను. నీతో పాటు ఆ మొసలికి కూడా సత్కారం చేస్తానులిలి అని అంది. ఆ మొసలి సంతోషించి "ఇకనుండి నేను కూడా అన్నీ జంతువులను నది దాటించి ఉపకారం చేస్తాను. నా బాధ్యత కూడా పెరిగింది" అని అంది. అందుకు సింహంతో పాటు అన్ని జంతువులు కూడా కరతాళ ధ్వనులను చేశాయి.

–సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

నిర్వహణ
–కందుకూరి శ్రీరాములు
–బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

మా ఊరి ఉత్తరవాహిని

గలగలల మా పెద్దవాగు తీరం
ఆత్మీయతలు అలలు అలలయి
నాగుబాములా పారుతున్న నదీప్రవాహం
రాళ్లు రప్పల అందాల తీరమంటున్నది
శివోహం.....శివోహం.....
ఎన్నిసార్లు దర్శించుకున్నా మరి తీరనంటన్నది
మనసుకు మోహం..... దర్శన దాహం...
అల ద్వార పాలకుడయిన ఆ నెమలి వృక్షం
అగస్త్యుని నాటి దేవాలయం కనినంతనే కల్గును మోక్షం
చుట్టూ తుమ్మతరువుల్లో ఒద్దికైన ఒడ్ల ఒంపులు
ఒంపుల్లో ఒయ్యారాల లోయలలోగొంతుల పిలుపులు
పిలుపు పిలుపుకు శివంశివమని పలికేటి బాలేశ్వర స్వామి
కొలువైన దివ్య మందిరం
కోరిన కోర్కెలుదీర్చు శివయ్య లింగరూపం సుందరం
గోగుల లింగయ్య గొప్ప కవి వాక్కుల్లో వర్ధిల్లు మా గ్రామం
అవధాని మాడుగుల పద్యకన్నెలు
ఏకశృతిలోపొగిడిపాడిన ఆధ్యాత్మిక ధామం
రాం రాం అంటూ కల్మషమెరుగని ఆదివాసుల నేల
కులమతాలు కుసుమాలయి పరిమళించు మానవత్వపుమాల
శుభాలొసగే శుక్లపక్షం రవిని వేడుకొను
బాలార్కుని రథసప్తమి వేడుకనే నేడు కన్నులార కను
వాగుతీరాన పల్లెలన్నీ కొల్లెరుకొంగలల్లే వాలంగా
జనసమూహంగా అలరారు అందాల నాటి జునుగాం
బాధల జీవితాలకు ఓదార్పుయాత్రగా
బహుసుందర బాలేశ్వరస్వామి రథయాత్ర
భిన్నత్వంలో ఏకత్వంగా పల్లవించును ఈ భూమి
యేడాది కొక సారి ఇల్లు వదలి కదల రా సామీ
చెప్పులు, కొప్పులు, క్లిప్పులు చప్పరించి కొరికే
లాలీ పప్పులు
వేరుశనగలువేయించిన పప్పులు,
మక్కపొత్తుల కాల్చే కొడిశెనిప్పులు
బ్యాగులు,చెవిపోగులు,నెమలీకలు,
కీలు,కీ చెయిన్ లు
దాల్లు,బాల్లు,లేళ్లు,తేళ్లు అందాల ట్రేయిన్లు
బొమ్మలు,బోళ్లు సర్కస్ తిరుగుళ్లు
బాసెన్లు,బెలూన్లు,
ప్లాస్టిక్ వస్తుజాలవర్ణవర్ణాలతిరునాళ్ళు
దేశదేశాల , దేవుళ్ల పటాలు
సోలల సోగకళ్లచూపుల్లో
బెస్తోల్ల పుట్నాలు

జాతర హేల...

బస్తాల్లో మురిపాల పరిపేలాలు
విబూది ఉండలు అయ్యోర్ల కుంకుమ రాసులు
దండలుదారాలు, పిన్నులు పిన్నీసులు
కల్వక కల్వక కలుసుకన్న కన్నులఊసులు
పత్తి పంటల పైసా పడుచు జంటల పైసా
మారాముపట్టే పిల్లల కన్నవాళ్ల పైసా
నదీగుండెలో హైలెస్సో హైలెస్సా
శరీరంమీద వింతైన టట్టూల మౌనగానాలు
రంగురంగుల చెమ్కీల బొట్టుబోనాలు
కళ్ల సైగతోటే రమ్మంటున్న పూసల మోనాలిసా
ఇంటికిపోవాలంటేసూటిగా
చూడమాకు వెర్రివెంకటేశా
పడుచువాళ్ల కళ్లసాలు సరసాలు
నారింజద్రాక్ష,దబ్బపండ్ల రసాలు
దొరుకును వేడివేడి పకోడి,జీలేబి ,వడలు
జాతరా ఇరుకు సందుల్లో తీపిచెరుకుగడలు
జల్సారాయుల్ల మస్తుమజాలు
రోజాలరాజాలు రోజంతా సన్నాయి బాజాలు
టోపీలాఆకతాయిల ఆర్కెస్ట్రా ధమరుకంప్లూట్ బాకాల
పీకాల పీపీలు
ఆపగలమా వయసోల్ల ఎక్స్ట్రా హ్యాపీలు
దుమ్ము రేగే దుమ్ముల సప్తమీసాయంత్రం
ఎదలోఎగజిమ్ము ఆనందమే యువత మంత్రం
మహామాఘి ముందటి మందుటెండల మాపటినీడల
దాగుడుమూతల్లో
ముసురేటి సందెలేతమసకల్లు మురిపెంగా ముద్దిడే
ఇసకల్లో
ఊరి పెద్దల,భక్తులతోడ మేళతాళాల నడుమ
పొడుగుమేలితాళ్ల పోటీపడిలాగే
అడుగు అడుగులజనసందోహమనోహరదృశ్యం
హరహరా మహదేవా
శివ శివా మహదేవా
జై భోలో బాలేశ్వర స్వామికీ జై అనే భక్తుల
భక్తిపారవశ్యంలో
రథము పై ఊరేగే బంగారు మా బాలేశ్వరస్వామి
రమనీయం కడుకమనీయం మా రథసప్తమి
ఇది మా జాతరహేల ఇది మా కుంభమేళా
ఇది మాఘమాసం ఇది మా ఇల అనురాగ హోసం.

–రమేశ్ నల్లగొండ

విత్తనాన్ని

ఆనందం పూసిన నవ్వు
ఊహల్లో గీసుకున్న చిత్రం..
గుండె సవ్వడిలో లయాత్మక రాగం
నిద్రలో కలల అలలు..
ఓ పులకరింత పలకరింత
అణువు అణువులో..
చిగురు చిగురులో..
మనసుపూలమదువులు..
తడిమి చూస్తేతగిలింది నేనే..
తట్టి లేపితే లేచిందినేనే ..
నవ్వుల్లోపువ్వుల్లో, చిత్రాల్లో
విచిత్రాల్లో రాగాల్లోఅనురాగాల్లో,
బంధాల్లోఅనుబంధాల్లో
అన్నింటిలో నేనే..
ఎక్కడికి పోగలను..
దాచిపెట్టిన విత్తనాన్ని
ఊపిరి భావాలు
చెమ్మగిల్లినది ఇప్పుడేగా!

–గడ్డం సులోచన
770 28915 59

బతికిన బతుకు .

కాటి వరకు
మోయడానికే కాదు
చివరకు
గుండెలు బాదుకుని
ఏడ్వడానికీ
సమూహమై
నల్గురుండాలి
ఊరి యాదిగా
మైత్రీ వనంగా
బతికిన బతుకంటే ఇదే మరి

–కందాళై రాఘవాచార్య
8790593638

సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

ప్రత్యక్ష దైవం.....

కని పెంచి పెద్దచేసి
జీవన మార్గదర్శనం చేసి
జీవితాన్ని ప్రసాదించిన
తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు.
విద్యను బోధించి
సమాజాన్ని పరిచయం చేసి
జ్ఞాన జ్యోతిని వెలిగించిన
ఉపాధ్యాయులు ప్రత్యక్ష దైవాలు

అక్షర కౌముది పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహితలను సత్కరిస్తున్న ముఖ్యఅతిథి డా॥ నాళేశ్వరం శంకరం తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): ఫిబ్రవరి 8న అక్షర కౌముది ఐదో వార్షికోత్సవం డాక్టర్ ఏఎస్ రావు నగర్ వాసుల సంఘంలో వైభవంగా జరిగింది.

తులసి వెంకట రమణాచార్యులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రసిద్ధ కవి డాక్టర్ నాళేశ్వరం శంకరం విచ్చేశారు.

సినారె పురస్కారం ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతి, తాళ్లూరి పురస్కారం ప్రముఖ కవి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, తులసి పురస్కారం ప్రఖ్యాత నాట్య గురువు డాక్టర్ వట్టి కోట యాదగిరాచార్యులు, మాణిక్యం పురస్కారం వ్యాపారవేత్త ముత్యాల తిరుపతి రెడ్డి, గురు సౌభాగ్య పురస్కారం నల్లవోతు రాణి అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రతిభను కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. భావనాలయ డాన్స్ ఇనిస్టిట్యూట్ విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.

ముఖ్యఅతిథి నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. సాహిత్యం, కళలు మనిషిని ఉన్నతపథం వైపు నడిపిస్తాయని అన్నారు. పురస్కార గ్రహీతలు అందరూ కూడా వారి వారి రంగాల్లో ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమ రూపకల్పన చేసిన సంస్థ ప్రధాన కార్యదర్శి మూర్తి శ్రీదేవిని, సంస్థ అధ్యక్షులు తులసి విజయలక్ష్మిని, ఉపాధ్యక్షులు తాళ్లూరి వెంకటకృష్ణని, మేనావత్ రాందాస్ ను అభినందించారు.

డిజిటల్ యుగంలోనూ మన ఆత్మీయ నేస్తం రేడియో !

ప్రపంచ మానవాళికి ఆత్మీయ నేస్తంగా గత 130 ఏండ్ల నుంచి సమాచార వినోద విజ్ఞాన క్రీడా సమకాలీన వార్తలను ఇంటింటి చేర్చుతున్న ఎలిక్ట్రానిక్ ఉపకరణంగా రేడియో అమూల్య సేవలను అందిస్తున్నది. టెలివిజన్, ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ రాకతో రేడియో వినియోగం కొంత తగ్గినా, నేటికీ మారుమూల మానవాళి మనసులను సహితం దోస్తున్న ఉపకరణం రేడియో మాత్రమే. నమ్మకానికి పెట్టింది పేరు మన రేడియో. సాపేక్షంగా చవకైన సాధనంగా రేడియో ప్రపంచ వార్తలను క్షణాల్లో అందిస్తూ, సహజ/మానవ తప్పిద విపత్తుల సమయంలో ప్రజలకు విలువైన సమాచారాన్ని అందిస్తున్న రేడియో ప్రాధాన్యం ఎన్నటికీ చెక్కు చెదరదు. వాహన ప్రయాణ సమయాల్లో మనందరికీ ఉపయోగకరమైన రేడియో మన నిత్య స్నేహితుడిగా వ్యవహరిస్తున్నది.

రేడియో ఆవిష్కరణ – అనేక ప్రయోజనాలు:

1895లో ఇటాలియన్ గుల్గిమో మార్కోనీ ఆవిష్కరించిన రేడియో కాలక్రమంలో 1919లో అమెరికాలో తొలి రేడియో స్టేషన్ ప్రారంభం కావడం, 1939లో ఎఫ్ఎం రేడియో ప్రసారాలు ప్రారంభం అయ్యాయి. 1994లో డిజిటల్ రంగులు అద్దుకోని 24 – గంటల సమాచార వితరణ ప్రసారాలు చేస్తున్న రేడియో నేటికీ ప్రతి ఇంట్లో మారుమోగుతానే ఉన్నది. ప్రపంచవ్యాప్త సమాచారం, విద్య, వైజ్ఞానిక, వ్యవసాయ, వినోద, వాతావరణ హెచ్చరికలు, స్థానిక వార్తలు, సంగీతం, లలిత గీతాలు, క్రీడా విశేషాలు, రన్నింగ్ కామెంటరీలు, చర్చలు, మార్కెటింగ్ అంశాలు, సమకాలీన సమస్యలు లాంటి అనేక అంశాలను నిత్యం మన వద్దకు చేర్చుతున్న రేడియో ప్రయోజనాలు అనంతం.

ప్రపంచ రేడియో దినం–2025:

2011లో యునెస్కో చొరవ, ప్రతిపాదనలతో 2012 నుంచి ఐరాస సభ్య దేశాలు ప్రతి ఏట 13 ఫిబ్రవరి రోజున "ప్రపంచ రేడియో దినం (వరల్డ్ రేడియో డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. రేడియో విలువను అవగాహన పరచడం, నవ్య టెక్నాలజీలను అందిపుచ్చుకొని అవసర మార్పులు చేసుకుంటూ నేటికీ రేడియో తన ఉనికిని చాటుకుంటూనే ఉన్నది. ప్రపంచ రేడియో దినం వేదికగా స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రేడియో ప్రసారాలు నిర్విరామంగా కొనసాగడాన్ని ప్రజలకు అవగాహన పరచడం కూడా జరుగుతుంది. అంతర్జాల డిజిటల్ టెక్నాలజీలను అందిపు చ్చుకొని వాతావరణ సమాచారాన్ని, వాతావరణ మార్పుల కట్టడికి నడుంబించిన మన నమ్మకమైనా మిత్రుడు రేడియో అంటూ ఏకరువు పెట్టడం కూడా జరుగుతుంది.

ప్రపంచ రేడియో దినం–2025 ఇతివృత్తం:

ప్రపంచ మానవాళినా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాతావరణ ప్రతుల మార్పులను ప్రజల చెత్తకు చేర్చుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వాతావరణ స్థాపన, పౌర సమాజ పాత్రను సహితం వివరించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో రేడియో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న వేళ ప్రపంచ రేడియో దినం–2025 ఇతివృత్తంగా "రేడియో – వాతావరణ మార్పులు : వాతావరణ కార్యాచరణకు శక్తివంతమైన సాధనం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రపంచ రేడియో దినం వేదికగా కార్యశాలలు, వెబినార్లు, సదస్సులు, చర్చలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యా వైజ్ఞానిక సమావేశాలు లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించాలి.

నేటి ఆధునిక డిజిటల్–ఏఐ యుగంలో కూడా రేడియో అవసర మార్పులు చేసుకుంటూ మానవాళి ప్రియ విశ్వాస నేస్తంగా రేడియో సేవలు అందిస్తున్న వేళ అందరికీ ప్రపంచ రేడియో దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుకుందాం, రేడియో ప్రసారాలతో ప్రయోజనం పొందుదాం.

(13 ఫిబ్రవరి "ప్రపంచ రేడియో దినం" సందర్భంగా)

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మరో హామీని అమలు చేసిన కూటమి సర్కార్

–హత్యకు గురైన తహశీల్దార్ సతీమణికి డిప్యూటీ తహశీల్దార్ గా పోస్టింగ్

అమరావతి, ఫిబ్రవరి 12:ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. విశాఖపట్నానికి చెందిన తహసీల్దార్ రమణయ్య గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో రమణయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని, ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఎన్నికల ముందు ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ హత్యకు గురైన రమణయ్య భార్య అనూషను డిప్యూటీ తహసీల్దార్‌గా నియామిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేడు పోస్టింగ్ ఆర్డర్స్ ను అచ్చెన్నాయుడు రమణయ్య భార్య అనూషకు అందజేశారు. కారుణ్య నియామకంలో భాగంగా డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా కృషి చేసి తమను ఆదుకుని, న్యాయం చేసినందుకు మంత్రి అచ్చెన్నాయుడుకు, ప్రభుత్వానికి డిప్యూటీ తహసీల్దార్ అనూష కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ అగస్త్య మహర్షి ఆలయంలో పవన్ ప్రత్యేక పూజలు

కేరళ, ఫిబ్రవరి 12: కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న శ్రీ అగస్త్య మహర్షి ఆలయాన్ని దర్శించుకున్నారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్. ఈసందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్షేత్ర సందర్శనలో పవన్ కుమారుడు అకీరా, టీటీడీ సభ్యుడు ఆనందసాయి పాల్గొన్నారు. కాగా నేటి సాయంత్రం ఆయన తిరువనంతపురంలోని పరశురామస్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు.

కుల గణనపై బీఆర్ఎస్ నాయకులు పదే పదే విమర్శలు చేయడం మానుకోవాలి-మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 12:సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కుల గణనపై బీఆర్ఎస్ నాయకులు పదే పదే విమర్శలు చేయడం మానుకోవాలని అన్నారు. 50 రోజుల పాటు సమగ్ర సర్వే కొనసాగినా.. కేటీఆర్ కుటుంబం సర్వేలో పాల్గొనలేదని, పైగా ప్రభుత్వాన్ని నిందించడం ఏంటని ప్రశ్నించారు.

అన్ని వర్గాలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే అధికారుల నిరంతర పర్యవేక్షణలో జరిగిందని అన్నారు. బీసీ డెడికేటెడ్ కమిటీ ఇచ్చిన రిపోర్టుపై సీఎం రేవంత్ రెడ్డితో రిజర్వేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. త్వరలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. మరో నాలుగు రోజుల్లో స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ప్రకటన వస్తుందని తెలిపారు. కులగణన రిపోర్ట్ పై బీసీల్లో కొంత అసంతృప్తి ఉందని ప్రశ్నించగా.. మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు.

బీసీల్లో ఎక్కడా అసంతృప్తి లేదని.. కావాలనే కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల్లో లేనిపోని అనుమానాలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కులగణనపై బీసీలకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా.. ప్రభుత్వం దృష్టి తీసుకురావొచ్చని మంత్రి సీతక్క కామెంట్ చేశారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలపై నేడు సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమావేశం కానున్నారు. ఈ భేటీలో రిజర్వేషన్లు, ఎన్నికల ఏర్పాట్లపై చర్చించనున్నారు. సమావేశంలో మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు.

రోజురోజుకు పడిపోతున్న చికెన్ ధరలు

అమరావతి, ఫిబ్రవరి 12:కొందరికి ముక్క లేనిదే ముద్ద దిగదు.. ప్రతిరోజూ కాదు ప్రతిపూటా చికెన్ తినేవారు వుంటారు. ఇక హైదరాబాద్ లో వుండేవారు కనీసం వారానికి ఒక్కసారైనా చికెన్ బిర్యానీ రుచిచూడకుండా వుండలేరు..రోజూ తినేవారు కూడా వుంటారు. చికెన్ లెగ్ పీస్ ఇష్టపడేవారు కొందరయితే, మెత్తని చెస్ట్ పీస్ ను ఇష్టంగా తినేవారు మరికొందరు,, ఇంకొందరు వింగ్స్, లివర్ వంటివి ఇష్టపడతారు. ఇలా చికెన్ బిర్యానీనో లేక చికెన్ కర్రీనో లేదంటే కబాబ్ వంటి స్పెషల్ వంటలో ఏదో ఒకరూపంలో ముక్క నోట్లో పడాల్సిందే అనేవారు చాలామంది వుంటారు.

ఇలా నాన్ వెజ్ అంటే పడిచచ్చేవారు ఇప్పుడు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

చికెన్ కిలో రూ.300, రూ.400 ఉన్నపుడు కూడా వెనకడుగు వేయకుండా కొనుగోలు చేసినవారు ఇప్పుడు కిలో కాదు కోడికి కోడే కేవలం 150 రూపాయలకు ఇస్తామన్నా తీసుకోడానికి జంకుతున్నారు. నాలుక ముక్క కోసం తహతహలాడుతున్నా చికెన్ తినలేని పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితి పగవాడికి కూడా రాకూడదని అనుకుంటున్నారు నాన్ వెజ్ ప్రియులు.

అసలు ఎందుకు చికెన్ ధరలు ఇంతలా తగ్గాయి.. నాన్ వెజ్ ప్రియులు చికెన్ తినడానికి ఎందుకు జంకుతున్నారు ఏకంగా ప్రభుత్వాలే చికెన్ తినొద్దని ఎందుకు హెచ్చరిస్తున్నాయి.. లక్షలాదిగా కోళ్ళు ఎందుకు చనిపోతున్నాయి ఈ ప్రశ్నలన్నింటిని ఒకటే సమాధానం బర్డ్ ఫ్లూ. ఈ మహమ్మారి వైరస్ విజృంభణతో దేశంలోనే కాదు తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఆంక్షలు తప్పడంలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూతో లక్షలాదిగా కోళ్లు చనిపోతుండడంతో ఏపీ నుంచి వస్తున్న కోళ్లను తెలంగాణలో తీసుకోవడం లేదు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ కారణంగా చికెన్ ధరలు కిలో రూ.150లు ఉండగా, త్వరలో మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో బర్డ్ ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఢిల్లీలో "అమృత బిందువులు" ఆవిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ మరియు ఆదిలీలా ఫౌండేషన్, తెలుగు సాహిత్య కళా వీఠం, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్త నిర్వహణలో భాగంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21) ను పురస్కరించుకొని, ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ఫిబ్రవరి 8,9 తేదీలలో రెండు రోజుల పాటు సాహిత్య, సాంస్కృతిక కార్య క్రమాలు జరిగాయి. ఆదిలీల ఫౌండేషన్ వ్యవ స్థాపకుడు డా. ఎస్. ఆదినాయణ అధ్యక్షతన శనివా రం సాయంత్రం(8 వ తేదీన) సుమారు యాభై మంది కవులతో నిర్వహించిన కవి సమ్మేళనం అనంతరం రాత్రి 8. 00గం. కు వడిచర్ల సత్యం రచించిన "అమృత బిందువులు" అనే పుస్తకాన్ని ఆవిష్కరిం చారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥ఈటెల సమ్మన్న, మాట్లాడుతూ దేశ రాజధానిలో తెలుగు సాహిత్య కార్యక్రమాల జరుపు కోవడం చాలా సంతోషంగా ఉందని, ఇలాంటివి మన భాష మనుగడకు ఉపయోగ పడతాయన్నారు. మణిపూసల కవితా ప్రక్రియలో రాయబడిన ఈ పుస్తకంలో అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో నైతిక విలువలు గురించి ఉన్న ఈ పుస్తకం అందరూ చదువదగి నదని పేర్కొన్నారు. ప్రముఖ పాత్రికే యులు మరియు ఫారిన్ కరస్పాండెంట్ అధ్యక్షులైన వెంకట్ నారాయణ ఆత్మీయ అతిథిగా పాల్గొని, కొన్ని కోట్ల మంది ప్రజలు తెలుగును మాట్లాడ తారని, భాషను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. గౌరవ అతిథులుగాపాండిచేరి నుండి విచ్చేసిన రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డా. లక్ష్మీపతి, సి.వి శ్రీనివాస మూర్తి, కృష్ణ సుందరి, పి. వి. ఆర్ మూర్తి, తెలుగు సాహిత్య కళా వీఠం ప్రధాన కార్యదర్శి పట్టాల అశోక్, అనంత వ్యవస్థా పక అధ్యక్షులు తూర్పు మల్లారెడ్డి, వ్యవస్థాపకులు దోరవేటి, అధ్యక్షులు బొబ్బాద్ రాఘవేంద్రా చార్యులు, శతావధాని డా. మలుగ అంజయ్య, కోటం చంద్రశేఖర్ లు హాజరయ్యారు. ప్రముఖ కవి, రచయిత టి. ఆశీర్వా దం గారు పుస్తక పరిచయం చేశారు. మణిపూసల సృష్టికర్త వడిచర్ల సత్యం ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలోని కందనెల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుండి, ఢిల్లి నుండి సాహితీ ప్రియులు, తదితరులు పాల్గొన్నారు.

బయోమాస్ ప్లాంట్ రైతులకు ఎంతో ప్రయోజనకరం.. మంత్రి తుమ్మల

ఖమ్మం, ఫిబ్రవరి 12: ఖమ్మం జిల్లా మండల కేంద్రమైన తల్లాడలోని కొత్తగూడెం రోడ్ లో గల బయోమాస్ ప్లాంట్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో బయోమాస్ ప్లాంట్ రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రైతులు ఆదరించి సహకరించి మేలు పొందాలని ఆయన అన్నారు.

బయోమాస్ ప్లాంట్ వలన రైతులు పంటలు దిగుబడి అయిన తర్వాత పత్తి కట్టే, మిరప కట్టే, మొక్కజొన్న చెత్తను రైతులు కాలబెట్టకుండా బయోప్లాంట్ ద్వారా కాలుష్య నివారణ చేసేందుకు ఈ ప్లాంట్ ఎంత ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

తెలంగాణ ప్రజలకు ఉద్యమస్ఫూర్తిని కలిగించిన దాశరథి

శ్రీనవాసమూర్తి రామాచారిలను సన్మానిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ.

హైదరాబాద్, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): దాశరథి కృష్ణమాచార్య తెలంగాణ ప్రజలకు ఉద్యమస్ఫూర్తిని కలిగించారని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. తేజిస్విని కల్చరల్ అసోసియేసన్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభలో ప్రఖ్యాత కవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి మహోత్సవం వైభవంగా జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డా॥ శ్రీనివాసమూర్తిని జీవితసాఫల్య పురస్కారంతో సత్కరించారు. ప్రముఖ గాయకుడు కె.రామాచారికి బాల గంధర్వ సారథి బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నా తెలంగాణ కోటి రతనాల వీణ అని తన కవితాధారలతో ప్రజల పక్షాన నిలిచి నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దాశరథి కృష్ణమాచార్య సాహిత్య చరిత్రలో శాశ్వతంగా ఉంటారని అన్నారు. అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం పూర్వ అధ్యక్షుడు విజయబాబు మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేకంగా పోరాడినా, సినీ పాటలు రాసిన దాశరథిలో మానవీయ కోణం కనిపిస్తుందన్నారు. బీజేపీ నేత మురళీధరరావు మాట్లాడుతు రాజాశ్రయం కోరకుండా నిజాంను ధిక్కరించి నిలిచిన దాశరథి శాశ్వతంగా నిలిచి ఉంటారన్నారు. సాహితీవేత్త డా॥ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ దాశరథి పదాలలోని అర్థాన్ని వివరించి ఆకట్టుకున్నారు. సంస్థ నిర్వాహకులు ఎస్‌బి సుధాకర్ స్వాగతం పలుకగా కార్యదర్శి, రాణి సుధాకర్ రాష్ట్ర గవర్నర్‌ను సత్కరించారు. కాగా ప్రతిభావంత వైద్యులకు వైద్య శిరోమణి అవార్డులు గవర్నర్ ప్రదానం చేశారు.

కలసి వస్తే కాంగ్రెస్‌తో లేకుంటే ఒంటరిగానే..

–స్థానిక సంస్థల ఎన్నికలపై సిపిఐ కార్యదర్శి కూనమనేని స్పష్టం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.

తమకు మిత్రపక్షమైన కాంగ్రెస్ తమతో కలసి వస్తే ఉమ్మడిగా పోటీ చేస్తామని, లేకుంటే బలంగా ఉన్న చోట అభ్యర్థులను బరిలోకి దింపుతామని చెప్పారు. హైదరాబాద్ లో ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులను కలుపుకోవడంలో వైఫల్యం చెందిందన్నారు. సమన్వయం చేసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీల కలయికతోనే గెలిచిందని కాంగ్రెస్ పార్టీ మర్చిపోతున్నదని అసహనం వ్యక్తం చేశారు.. స్థానిక సంస్థల ఎన్నికలలో రేవంత్ పాలనపై ప్రజలే తీర్పు ఇస్తారని అన్నారు..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కాంగ్రెస్ కే ..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై చర్చిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేయడాన్ని తాను స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి పోకడకు వెళ్లకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సునందామృతం

తృణ రజ్జు న్యాయము

తృణము అంటే గడ్డి.రజ్జు అంటే తాడు. తృణ రజ్జు అంటే గడ్డి పోచలతో ఏర్పడిన తాడు.

బలహీనమైన గడ్డిపోచలు కలిపి పేనితే బలిష్ఠమైన వోకులా తయారవుతుంది.

దానితో ఎంతటి మద గజాన్నైనా బంధించగలము అంటే ఎంత బలహీనులమైనా ఐకమత్యంతో కష్టమైన పనిని సాధించ వచ్చు అనే అర్థంతో ఈ తృణ రజ్జు న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

ఐకమత్యం ఎంత అవసరమో తద్వారా ఏం సాధించవచ్చో ఈ న్యాయానికి సరితూగే వేమన పద్యాన్ని చూద్దాం.

"ఐకమత్య మొక్క టావశ్యకంబెపు/ దాని బలిమి నెంతనైన గూడు/ గడ్డి వెంటి బెట్టి కట్టరా యేనుంగు/ విశ్వధాభిరామ వినురవేమ!"

ఐకమత్యం అనేది ఎల్లప్పుడూ అవసరమే. ఐకమత్యానికి ఉన్న బలం దేనికి సాటిరాదు.దాని వలన కలిగే ప్రయోజనం అంతా ఇంతా కాదు. బలహీనమైన గడ్డిపోచలను కలిపి పేనిన వోకుతో ఏనుగును కట్టలేమా? అంటే కట్టగలం.కట్ట గలిగాం కదా అంటారు వేమన.

ఈ ఐకమత్యం యొక్క గొప్పతనాన్ని గురించి పంచ తంత్ర కథల్లో నాలుగు ఎద్దులు– సింహం కథ, నీతి కథల్లో తండ్రి– నలుగురు కుమారుల కథ చదువుకున్నాం.

''గడ్డి పోచంత హీనంగా తెలంగాణ ప్రజలను భావించిన నిజాం రాజు గర్వాన్ని అణచేందుకు ఐకమత్య బలంతో గడ్డిపోచ కూడా కత్తిపట్టి ఎదిరించిందని దాశరథి కృష్ణమాచార్య తాను రచించిన రుద్రవీణలో అంటారు.

''తెలగాణమ్మున గడ్డిపోచయున్ సంధించెన్ కృపాణమ్ము"..దీనిని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు.ఎంత బలహీనులమైనా ఐకమత్యంతో ఏదైనా సాధించవచ్చని.

ఐకమత్యం విలువ తెలుసుకుని అన్యాయాలను, అక్రమాలను కలిసికట్టుగా ఎదిరిద్దాం.తృణ రజ్జు న్యాయమును నిజం చేద్దాం.

ప్రభాత కిరణాల సమస్సులతో...

–పురిమళ్ల సునంద
9441815722

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
విస్తరణ సేవా విభాగం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు
ఆహ్వానం
ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య స్మారకోపన్యాసం
సభాధ్యక్షులు
ఆచార్య వెలుదండ నిత్యానందరావు
ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ముఖ్య అతిథి
డా. కె.వి. రమణాచారి, ఐ.ఎ.ఎస్.(రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వసలహాదారు
ఆత్మీయ అతిథి
శ్రీ డి. లక్ష్మణాచార్యులు
పూర్వ పర్యవేక్షక ఇంజనీర్, రహదారులు మరియు భవనాలశాఖ, తెలంగాణ
స్మారకోపన్యాసకులు
శ్రీ గన్నమరాజు గిరిజా మనోహరబాబు
ప్రముఖ రచయిత
అంశం : సంపత్కుమారాచార్య పద్యవిద్యావైభవం
తేది : 14-02-2025, శుక్రవారం మ. 3 గంటలకు
వేదిక : డా. ఎస్.టి.ఆర్. కళామందిరం,
తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు
ఈ కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం
రింగు రామమూర్తి
అసిస్టెంట్ డైరెక్టర్, విస్తరణ సేవా విభాగం
ఆచార్య కోట్ల హనుమంతరావు
రిజిస్ట్రార్

అందరికీ ఆహ్వానం
JCI Tirupati
జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్, తిరుపతి
వారి ఆధ్వర్యంలో
ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచన
మీది తెనాలి – మాది తెనాలి
(కొసమెరుపు కామెడీ కథలు)
కథా సంపుటి పుస్తక ఆవిష్కరణ సభ
పుస్తక ఆవిష్కర్త
ఆచార్య జంపాల వెంకట రమణ
ఉపకులపతి, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, తిరుపతి
విశిష్ట అతిథి
శ్రీ పి.రాము
ఎడిటర్, హాస్యానందం మాసపత్రిక, మంగళగిరి
ఆత్మీయ అతిథి
ఆచార్య మూలె విజయలక్ష్మి
భాషావేత్త, తిరుపతి.
సమీక్షకులు
డా॥ చింతకుంట శివారెడ్డి
సహాయ పరిశోధకులు
సి పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప
తేది : 16-02-2025 ఆదివారం సాయంత్రం 4.00 గంటలకు
వేదిక : ఛాంబర్ ఆఫ్ కామర్స్, హథీరాంజీ కాలనీ, తిరుపతి.
సెల్ : 93936 62821
అధ్యక్షులు జె.సి.ఆర్.శేషసాయి
కార్యదర్శి జె.సి.వి.దిలీప్ కుమార్
కోశాధికారి జె.సి.ఎస్.దిలీప్‌కుమార్ రెడ్డి

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.